


Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్




బుధవారం, 31 జూలై 2024 | విజయవాడ | సంపుటి 1 | సంచిక 53 | పేజీలు 8+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi



# కేరళలో విలయం.. ఎడతెరిపిలేని వాన..

## విరిగిపడ్డ కొండచరియలు .. భారీగా ప్రాణనష్టం

122కు చేరిన మృతులు సంఖ్య

బాధితులకు సమీప ఆస్పత్రుల్లో చికిత్స

సహాయక చర్యలకు అడ్డంకిగా వర్షాలు

వయనాడ్‌లో రంగంలోకి ఆర్మీ

ఆర్మీ హెలికాప్టర్లతో సాయం

తిరువనంతపురం,జూలై30(సూర్య వాస్తవం): కేరళలో వర్షం విలయం సృష్టిస్తున్నది. వయానాడ్ జిల్లాలో మెప్పడి సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో భారీగా ప్రాణనష్టం జరిగింది. మంగళవారం ఉదయం నాలుగు గంటల వ్యవధిలోనే మూడు సార్లు కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ విలయం కారణంగా 122 మంది ఇప్పటికే మరణించారు. కనీసం 128 మంది గాయాలపాలయ్యారు. మరికొందరు కొండచరియల కింద చిక్కుకుని ఉండవచ్చుని అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తున్నది. ప్రస్తుతం ఎన్డీఆర్ఎఫ్, ఆర్మీ సహా పలు ఏజెన్సీలు సహాయక చర్యల్లో మునిగిపోయాయి. మిగతా 2లో..

### వయనాడ్ ఘటనపై ప్రధాని విచారం

మృతుల కుటుంబాలకు 2లక్షల పరిహారం

అండగా ఉంటామని సిఎం విజయన్ హామీ

వయనాడ్ విషాదంపై రాహుల్ ఆవేదన

తక్షణం సహాయచర్యలపై లోక్‌సభలో ప్రస్తావన

అదనపు పరిహారం అందించాలని వినతి

న్యూఢిల్లీ,జూలై30(సూర్య వాస్తవం): కేరళలోని వయనాడ్ జిల్లాలో ఘోర ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. భారీ వర్షాలకు మెప్పాడి సమీపంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున కొండచరియలు విరిగిపడటంతో 70మంది వరకు మంది జలసమాధి అయ్యారు. ఈ ఘటనపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఈ మేరకు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన వారు వేగంగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఘటనపై కేరళ ముఖ్యమంత్రి మిగతా 2లో..

# జగన్ అక్రమాలపై ఉక్కుపాదం

## అవినీతిని వెలికితీసే ప్రయత్నాల్లో బాబు

## దర్యాప్తులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు



ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తోంది. ఓ వైపు అవినీతిపై యుద్ధం చేస్తూనే..గత ప్రభుత్వ అరచకాలను బయటపెడుతూనే..అభివృద్ధిలో కీలక అడుగులు వేస్తోంది. అభివృద్ధి , సంక్షేమాన్ని కొనసాగిస్తూ..జగన్ అవినీతపై అంకుశం దింపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి మాటున జరిగిన అవినీతి జరిగిన అవినీతి, అక్రమాల దోపిడీలు.. అంతకుమించి అనేలా పెరిగిపోయాయని గుర్తించింది. జగన్ ప్రభుత్వంఅవినీతిలో కూరుకుపోయిన అంశాలపై దృష్టి సారించింది. అందుకు బాధ్యులెవరో తేల్చే పనిలో పడింది. చంద్రబాబు సర్కార్ దూకుడుగా ముందుకెళ్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు పట్టుకుంది. ప్రభుత్వం మారాక దస్త్రాల దగ్ధం ఘటనలు ఇందుకు నిదర్శనం. అక్రమాలు లేకుంటే దస్త్రాలను దహనం చేయాల్సిన పనిలేదు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం.. నిజాలు నిగ్గు తేల్చేందుకు విచారణకు ఆదేశిస్తోంది.

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): మద్యం అక్రమాలపై సీఐడీ విచారణ.. మదనపల్లి దస్త్రాల దగ్ధంపై దర్యాప్తు.. టీడీఆర్ బాండ్లపైనా ఏసీబీ ఎంక్వైరీ.. రఘురామ కుట్ర ఫిర్యాదుపై విచారణ వేగవంతం.. ఇలా ఏపీలో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం సంచలన నిర్ణయాలతో ముందుకెళ్తోంది. ఎక్కడ అవినీతి జరిగిందని అనుమానం వచ్చినా.. ఎవరు ఆరోపణలు చేసినా.. ఆఖరికి కుట్ర కోణం జరిగిందని అనుమానం ఉన్నా విచారణకు ఆదేశిస్తోంది. తప్పు చేసిన వారిని వదిలేదేలే అని హెచ్చరిస్తోంది.ప్రభుత్వం మారింది.. మంత్రులంతా రివ్యూలతో ఆఫీస్‌లకే పరిమితమ య్యారు. ఆ సమయంలో కృష్ణాజిల్లా యనమలకుదురు కట్టపై ప్రభుత్వ రికార్డులు తగలబెట్టిన ఘటన సంచలనం రేపింది. స్థానికులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కొంతమందిని పోలీసులకు అప్పగించారు. పీసీబీ, మైనింగ్ ఫైళ్లు కాలి బూడిదయ్యాయి. ఉన్నపళంగా కట్టపై ఎందుకిలా చేశారన్నది అంతుబట్టలేదు. యనమలకుదురు కట్టపై ఫైళ్ల దగ్ధం ఘటన మరువకముందే.. మిగతా 2లో..

### పెన్షన్ల జాప్యంపై సుప్రీంకోర్టు

# ఆగ్రహం

## కేంద్రానికి రెండు లక్షలు జరిమానా విధింపు

న్యూఢిల్లీ,జూలై30(సూర్య వాస్తవం): పెన్షన్ల జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకం అమలు చేయకపోవడపై కేంద్రంపై సీరియస్ అయ్యింది. భారత సైన్యంలో రీటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్‌లకు చెల్లించే కేంద్రం నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్‌ర్యాంక్ వన్ పెన్షన్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ పక్రియలో ఏళ్ల తరబడి జాప్యం చేస్తోందని మండిపడింది. మిగతా 3లో..



### ఇదే సభలో కులగణన బిల్లు

# ఆమోదిస్తాం

అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలపై రాహుల్ సవాల్

## ఠాకూర్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందన



న్యూఢిల్లీ,జూలై30(సూర్య వాస్తవం): ఇదే సభలో కులగణన బిల్లును ఆమోదించి చూపుతామని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రకటించారు. లోక్ సభలో బిజెపి ఎంపీ అనురాగ్ ఠాకుర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. తనను అవమానించారని మండిపడ్డారు. అనురాగ్ ఠాకుర్ 'ఎవరికైతే తమ కులం కూడా తెలియదో వారు కుల గణన గురించి మాట్లాడుతున్నారని అన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ ఎవరైతే ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వారికి సంబంధించిన సమస్యలు లేవనెత్తుతారో వారిని కించపరుస్తున్నారని అన్నారు. మిగతా 3లో..

# దళితులకు ఆర్థిక భద్రత

## గిరిజన ప్రాంతాల్లో డోలీ కానరావద్దు

## గర్భిణి వసతిగృహాలు అందుబాటులోకి రావాలి

## ట్రైకార్, జీసీసీ, ఐటీడీఏలు చురుకుగా పనిచేయాలి

## గిరిజన సంక్షేమంపై సిఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): గిరిజన ప్రాంతాల్లో రానున్న రోజుల్లో డోలీ మోతలు కనిపించకూడదని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గిరిజన మహిళల సౌకర్యం కోసం గర్భిణి వసతి గృహాలు, ట్రైకార్, జీసీసీ, ఐటీడీఏలను యాక్టివేట్ చేయాలని సూచించారు. గత ప్రభుత్వ వ్యవస్థల విధ్వంసంతో గిరిజనుల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని మండిపడ్డారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఫీడర్ అంబులెన్స్‌లను తిరిగి ప్రవేశ పెట్టాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖపై సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. 2014 నుంచి 2019 మధ్య అమల్లో ఉన్న పథకాలను వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థుల కోసం తెచ్చిన ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేడ్కర్ ఓవర్ సీస్ విద్యానిధి, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాలను నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గిరిజన ప్రజలకు విద్యా పథకాలు, వైద్యం, సంక్షేమ పథకాలు అందించడంలో ఉన్న మిగతా 6లో..

# పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం సన్నద్ధం

ఆగస్టు 1న పంపిణీకి సుదీర్ఘ కసరత్తు

పెన్షన్ల పంపిణీపై మార్గదర్శకాలను విడుదల

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల పంపిణీకి సిద్ధం అవుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్లు రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేసింది.. అది కూడా అప్పటి వరకు ఉన్న వాలంటీర్ వ్యవస్థ సపోర్ట్ లేకుండానే ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసింది చంద్రబాబు సర్కార్.. ఇక, మిగతా 7లో..



# డిప్యూటీ సీఎం పవన్‌తో యూఎస్ కాన్సుల్ జనరల్ భేటీ

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం అయ్యారు యూ.ఎస్. కాన్సల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్.. మంగళగిరిలోని పవన్ కల్యాణ్ నివాసంలో ఈ రోజు ఉదయం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. మిగతా 7లో..



# డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కు ఊరట

## గత ప్రభుత్వ కేసులపై విచారణ నిలిపివేత

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై వైసీపీ ప్రభుత్వం పెట్టిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. గతంలో గ్రామ వార్డు సచివాలయ వలంటీర్లపై పవన్ కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని వైసీపీ కేసు పెట్టింది అయితే ఈ కేసుపై గుంటూరు కోర్టు మంగళవారం నాడు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పవన్ తరపు న్యాయవాదులు ఏపీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అన్యాయంగా పవన్‌పై గత ప్రభుత్వం కేసు వేసిందని హైకోర్టు దృష్టికి న్యాయవాదులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గుంటూరు కోర్టుకు ఉన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు జారీ చేసింది. గత ప్రభుత్వం పలువురిపై మిగతా 7లో..

### గంజాయి నిషేధంకోసం

# తీవ్రకృషి

ఏజెన్సీలో గంజాయి పంటమీద సీసీ కెమెరాలతో నిఘా

## గంజాయి నివారణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

## గత ప్రభుత్వ హయాంలో పోలీస్‌వ్యవస్థ నిర్వీర్యం

## హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడి



విశాఖపట్నం,జూలై30(సూర్య వాస్తవం): వైసీపీ ప్రభుత్వంలో పోలీసు వ్యవస్థ నిర్వీర్యమైందని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. గంజాయి నివారణ, పోలీస్ సంక్షేమం మీద సమీక్ష నిర్వహించామని తెలిపారు. పోలీసు విభాగం ఇన్వెస్టిగేషన్ టూల్ లేవని చెప్పారు. ఎక్కడ ఏం జరిగిన దాని వెనుక గంజాయి ఉందని తెలిపారు. ఈ ఐదు జిల్లాలో గంజాయి నియంత్రణకు కృషి చేస్తున్నామని వివరించారు. ఏజెన్సీలో గంజాయి పంట మీద సీసీ కెమెరాలతో నిఘా పెట్టామని అన్నారు. గంజాయి నివారణపై మంత్రివర్గ ఉప సంఘం నియమించినట్లు గుర్తుచేశారు. హోం మంత్రి, విద్యా శాఖ మంత్రి, మిగతా 7లో..

# ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్‌కు లైన్‌క్లియర్

## ఏపీ అసెంబ్లీని ప్రొరోగ్ చేసిన గవర్నర్

## నోటిఫికేషన్ జారీచేసిన గవర్నర్

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీని ప్రొరోగ్ చేశారు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్.. అసెంబ్లీని ప్రొరోగ్ చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు.. ఇక, అసెంబ్లీని ప్రొరోగ్ చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ ఇవ్వడంతో ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ జారీకి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లైన్ క్లియర్ అయ్యింది.. దీంతో.. ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ జారీపై మిగతా 7లో..

# నకిలీ హాలోగ్రామ్‌లతో మద్యం సరఫరా

## విజిలెన్స్ విచారణలో వెల్లడి

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): ఎక్సైజ్ శాఖలో గత ప్రభుత్వ నిర్వాకాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నకిలీ హోలో గ్రామ్ స్టిక్కర్లతో మద్యం సరఫరా జరిగినట్టు అనుమానిస్తున్నారు. డిపోల నుంచి కాకుండా నేరుగా మద్యం ఉత్పత్తి కంపెనీల నుంచే దుకాణాలకు మద్యం బాటిళ్లను తరలించినట్టు తెలుస్తోంది. ఏడాదికి 13.68 లక్షల మద్యం, బీరు బాటిళ్లకు హోలో గ్రామ్ స్టిక్కర్ల టెండర్లలోనూ గోల్ మాల్ చేశారని విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. హోలో గ్రామ్ పేరిట భారీ స్థాయిలో స్కామ్ జరిగినట్టు అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లకు వేసే హోలో గ్రామ్ టెండర్లను మిగతా 6లో..

# కేసీ కెనాల్ భూములలో అక్రమ కట్టడాలు

– విషయం తెలిసి కూడా నిమ్మకు నీరెత్తిన అధికారులు – అధికారుల తీరుపై మండిపడుతున్న రైతులు,ప్రజలు

సూర్య వాస్తవం
చెన్నూరు జులై 30 :-

చెన్నూరు వద్ద గల కేసీ కెనాల్( ఎస్బిఐ బ్యాంక్ ఎదురుగా ఉన్న) భూములలో కొంతమంది వ్యక్తులు అక్కడ స్థలాలు కొనుగోలు చేసి పక్కనే ఉన్న కేసీ కెనాల్ కు సంబంధించిన విలువైన భూములను సర్వే నంబర్ 840–బి1,841–బి1 ఆక్రమించి అక్రమ కట్టడాలు కడుతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు, దీనికి సంబంధించి అనేకసార్లు కేసీ కెనాల్ కు సంబంధించిన సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వారు చర్చించుకుంటున్నారు, అలాగే అక్కడ భూమి కలిగిన కొంతమంది రైతులు తమ పొలాలలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంతో వారు కేసీ కెనాల్ అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు, చెన్నూరుకు సంబంధించిన రైతు అంబవరం భాస్కర్ రెడ్డి కేసీ కెనాల్ అక్రమ కట్టడాల పైన కేసీ కెనాల్ ఏఈ జమాల్ వలికి ఈ విషయంపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని, చూసి చూడనట్లు ఉండాలని ఏఈ తెలిపినట్లు రైతు భాస్కర్ రెడ్డి మండిపడుతున్నారు, తమ పొలానికి వెళ్లేందుకు దారి లేక సదరు అక్రమ కట్టడాలు కట్టిన వ్యక్తిని అడిగితే నీ ఇష్టం వచ్చిన వారికి చెప్పుకో నా ఇష్టం వచ్చినట్లు ఆక్రమించి కట్టుకుంటా, కేసీ కెనాల్ అధికారులకు లేని నొప్పి, నీకెందుకు అని అతనిపై దుర్భాషలాడినట్లు అమ్మవరం భాస్కర్ రెడ్డి విలేకరులకు తెలిపారు, పలుసార్లు ఈ విషయమై కేసీ కెనాల్ అధికారులకు తెలియజేసినప్పటికీ, వారు చూసి చూడనట్లు ఉండాలని భాస్కర్ రెడ్డికి సలహా ఇచ్చినట్లు భాస్కర్ రెడ్డి కేసీ కెనాల్ అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేశారు, ఈ విషయమై ఆయన గ్రీవెన్స్ సెల్ ద్వారా కేసీ కెనాల్ అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దీనిపై సర్వే నిర్వహించాలని కోరినప్పటికీ కేసీ కెనాల్ అధికారులు కాలయాపన చేస్తున్నారని భాస్కర్ రెడ్డి ఆరోపించారు, ఈ విషయమై విలేకరులు కేసీ కెనాల్ ఏఈ జమాల్ వల్లిని









వివరణ అడగగా ఆయన స్పందిస్తూ ఈ విషయమై తమకు ఫిర్యాదు అందడం వాస్తవమని దీనిపై సర్వే నిర్వహించాలని చెన్నూరు తాసిల్దార్ కు తెలపడం జరిగిందని ఆయన తెలిపారు, తమకు కేసీ కెనాల్ కు సంబంధించిన పనులు ఉన్నందున ఆగస్టు 3 వ తేదీ శనివారం రోజున అక్రమ కట్టడాలను పరిశీలించడమే కాకుండా దీనిపై సమగ్ర విచారణ చేపడతామని కేసీ కెనాల్ కు సంబంధించిన భూ సర్వే నిర్వహించి తమ హద్దులను ఏర్పాటు చేయడమే కాకుండా అక్రమ కట్టడాల దారులపై చర్యలు చేపడతామని ఆయన తెలియజేశారు, ఏది ఏమైనాప్పటికీ కేసీ కెనాల్ కు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా వాటి సరిహద్దులు ఏర్పాటు చేసి, సంబంధిత అధికారులు వాటిని కాపాడవలసిన అవసరం ఎంతైనా ఉందని అటు రైతులు ఇటు స్థానిక ప్రజలు కోరుతున్నారు..

## శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద

### ఏడు క్రస్ట్ గేట్లు ఎత్తి సాగర్‌కునీటి విడుదల
### వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ

శ్రీశైలం,జూలై30(సూర్య వాస్తవం): ఎగువ నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం భారీగా పెరుగుతున్నది. దీంతో అధికారులు ఏడు క్రస్ట్‌గేట్లను 10 అడుగులమేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్‌కు నీటిరాక పెరిగింది. మంగళవారం జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి నుంచి 19,653 క్యూసెక్కులు, క్రస్ట్‌గేట్ల ద్వారా 2,61,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. సుకేశుల నుంచి 1,07,246 క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 3,88,460 క్యూసెక్కుల నీరు చేరుకోగా.. రిజర్వాయర్ నుంచి 4,13,178 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైనట్లు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి



నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 207 టీఎంసీలుగా ఉన్నది. కుడిగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 25,684 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి ద్వారా చేసి దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. మరో వైపు శ్రీశైలం జలాశయం డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో శ్రీశైలం రహదారులన్నీ పర్యాటకులతో సందడిగా మారాయి. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు శ్రీశైలం బాటపడుతున్నారు. మరో వైపు రిజర్వాయర్‌కు వరద పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్తగా ఎవరూ వెళ్లొద్దని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. మంగళవారం ఉదయం టూరిజంశాఖ అధికారులకు, మత్స్యకారులకు నోటీసులు జారీ చేశారు. నీటి ప్రవాహం తగ్గే వరకు పడవలు నడపొద్దని సూచించారు.

## ఆసక్తికరంగా తెలంగాణ రాజకీయాలు

### అనూహ్యంగా ఎమ్మెల్యే బండ్ల యూ టర్న్
### తిరిగి బిఆర్ఎస్‌లోకి వెళ్లిన గద్వాల ఎమ్మెల్యే

**తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుతం బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అంశం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏకంగా 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో.. బీఆర్ఎస్ఎల్పీ విలీనం దిశగా హస్తం పార్టీ అడుగులు వేస్తోందనే చర్చలు జోరుగా సాగాయి. బీఆర్ఎస్ చుట్టూ కాంగ్రెస్ మైండ్ గేమ్ నడుస్తోందని అనుకుంటున్న తరుణంలో గద్వాల ఎమ్మెల్యే యూ టర్న్ తీసుకున్నారు. తిరిగా ఆయన సొంతగూడు బిఆర్ఎస్‌లో చేరారు. బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరినట్లే చేరి తిరిగి బిఆర్ఎస్‌లోకి వెళ్లారు. ఇప్పుడు ఈ వ్యవహారం చూస్తుంటే కాంగ్రెస్‌లోకి వచ్చేవారికి పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదని, బిఆర్ఎస్‌లో ఉంటే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందన్న భావన ఉంది.**

హైదరాబాద్,జూలై30 ):
కాంగ్రెస్ నేతల కామెంట్స్ చూస్తుంటే అదే అనిపిస్తుంది. ఒకవైపు ఎమ్మెల్యేల



జాయినింగ్స్‌తో బీఆర్ఎస్ఎల్‌పీ.. కాంగ్రెస్‌లో విలీనం ఖాయమని చెప్తూనే.. మరోవైపు.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కామెంట్స్ చేయడం ఆసక్తిగా మారుతోంది. బీఆర్ఎస్ విలీనంపై కోమటిరెడ్డి కామెంట్స్ వెనుక ఉన్న అర్థం ఏంటన్నది తెలియాలి. నిజానికి అంత ఆకాంగ్రెస్‌లో చేరుతారని అనుకున్నారు. కాంగ్రెస్ మైండ్ గేమ్ విమర్శలను బీఆర్ఎస్ ఎలా తిప్పికొట్టబోతోందన్నదీ ఆసక్తికరంగా మారింది. అయితే.. సరిగ్గా ఇలాంటి సమయంలోనే బీఆర్ఎస్ విలీనంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్?రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్ర బ్జడెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగినా మోదీ సర్కార్‌ను కేసీఆర్ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనానికి చర్చలు జరుగుతున్నాయనేదానికి ఇదే నిదర్శనమని చెప్పారు. బీజేపీలో విలీనానికి అడుగులు పడుతుండడంతోనే కేంద్రాన్ని కేసీఆర్ ఒక్క మాట అనడంలేదని ఆరోపించారు. వాస్తవానికి.. ఇప్పటికే 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా త్వరలోనే కాంగ్రెస్‌లో చేరతారని హస్తం పార్టీ నేతలు లీకులు ఇచ్చారు. దాంతో.. బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం ఖాయమనే సంకేతాలు వచ్చాయి. బీఆర్ఎస్ఎల్పీ విలీనంపైనే పెద్దయెత్తున చర్చలు సాగుతుండడగా.. బీఆర్ఎస్ పార్టీ విలీనంపైనా తమకు పక్కా సమాచారం ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన కామెంట్స్ ఆసక్తిగా మారుతున్నాయి. అంటే.. ఈ లెక్కన.. బీఆర్ఎస్ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం అయితే.. బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతుందా అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అటు.. కాంగ్రెస్ నేతల కామెంట్స్‌ను బీఆర్ఎస్ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. కాంగ్రెస్ మైండ్‌గేమ్ విమర్శలను తిప్పికొట్టేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. మొత్తంగా.. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనం ఖాయమన్న కోమటిరెడ్డి కామెంట్స్ తెలంగాణ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. అయితే అనూహ్యంగా బండ్ల వోనక్కి వెళ్లడంతో బిఆర్ఎస్ ఎత్తుకు పె ఎత్తులు వేస్తోందని అర్థం అవుతోంది. వెళ్లిన వారు తిరిగి వస్తారన్న ధీమాలో ఉన్నారు.

# బిఆర్ఎస్ కొత్త డ్రామాలకు తెర

### ఎమ్మెల్యేల యూటర్న్ అంటూ ప్రచారం
### అలాంటిదేమీ లేదు.. మరికొందరు చేరుతారు
### మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డిల ధీమా
### బిఆర్ఎస్ డ్రామాలను నమ్మరన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



హైదరాబాద్,జూలై30(సూర్య వాస్తవం): ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని.. అదంతా గులాబీ నేతలు చేసుకుంటున్నా ప్రచారమేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంటకటరెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఇదంతా బిఆర్ఎస్ ఆడుతున్న డ్రామాలని అన్నారు. తమ ఎమ్మెల్యేలు జారి పోవడంతో కొత్త డ్రామాలకు తెరలేపారని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఎక్కడికి పోరని మంత్రి పొంగులేటి తేల్చిచెప్పారు. మంగళవారం నాడు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. పాత పరిచయం కాబట్టి కలసి ఉంటారని అన్నారు. తమ దగ్గరకి వచ్చిన నేతలు ఎవరు ఇబ్బంది కలగకుండా ఉంటారని చెప్పారు. తమ దగ్గర ప్రేమ రాజకీయాలు ఉంటాయని అన్నారు. ఎవరు ఎక్కడికి పోరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..తిరిగి సొంతగూటికి చేరుతున్నారని వస్తున్న వార్తలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. చాంబర్ కు వెళ్లినంత మాత్రానా పార్టీలో చేరినట్లా అని ప్రశ్నించారు. కేటీఆర్ కూడా నా చైర్ దగ్గరకు వచ్చి మాట్లాడారా?. ఆయన కాంగ్రెస్ లో చేరినట్లేనా అని అన్నారు. బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అలాగే కలిసి ఉంటాడు.. ఆయన ఎక్కడికి వెళ్లడు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గట్టిగా చెప్పారు. జగదీష్ రెడ్డి నేను అన్న మాటలకు ఒప్పుకున్నారు.. సీఎంరేవంత్ రెడ్డి ఫారిన్ వెళ్లే నేను ఉన్నాగా చూసుకోవడానికి .. బీఆర్ ఎస్ నేతలకు నేను చాలు అని వార్నింగ్ ఇచ్చారు. త్వరలో ప్రధానిని కలుస్తా.. రాష్ట్ర రహదారుల కోసం నిధులు అడుగుతా అన్నారు. బీఆర్ ఎస్ ఎత్తేసిన అన్ని వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ఇస్తామన్నారు. ఉప్పల్–నారపల్లి ఫ్లై ఓవర్ కు త్వరలోనే రీ టెండర్ పిలుస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. ఎస్ ఎల్ బీసీ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత చాలా కీలకమైనది.. కేసీఆర్ అసెంబ్లీకి రానప్పుడే ఆ పార్టీపై ఆశలు వదులుకున్నారు. కేసీఆర్ కు ప్రజలమీద ప్రేమ లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ముగ్గురు కలిసి రేవంత్ రెడ్డిని ఓడించలేకపోయారు అని అన్నారు. ఎమ్మెల్యేలు ఎవరు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌కు అక్కడి స్థానిక పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలియదని అన్నారు. బీఆర్ఎస్ కావాలనే లీక్‌లు ఇస్తుందని చెప్పారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన అందరూ ఎమ్మెల్యేలు పార్టీలోనే ఉంటారని.. బీఆర్ఎస్ నుంచి ఇంకా ఎమ్మెల్యేలు వస్తారని ఆది శ్రీనివాస్ తేల్చిచెప్పారు. తాను కచ్చితంగా మంత్రిని అవుతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ శాఖకు మంత్రి అవుతాననేది మాత్రం చెప్పలేనని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యేను తానని గుర్తుచేశారు. తనకు మంత్రి పదవి రాకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మంగళవారం నాడు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్ర జనాభాలో 40శాతం జనాభా హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో ఉన్నారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను విస్మరించినట్లేనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే బిఆర్ఎస్ పార్టీలో బి తొలగించి తిరిగి టి పెట్టే దమ్ముందా అని మాజీ మంత్రి కేటీఆర్‌కు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. డిఎంకె, టిఎంసి లాంటి పార్టీలకు ఒక ఫిలాసఫీ ఉందని బీఆర్ఎస్‌కి ఏ ఫిలాసిఫీ ఉందని ప్రశ్నించారు. అధికారం ఉన్నపుడే బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ఏం చేయలేకపోయిందని.. ఇప్పుడేం చేస్తారని అన్నారు.గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డికి ఓపిక లేదని.. నియోజకవర్గంలో ఆయన చెప్పినట్లు పార్టీ యావత్ ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన మనుషులకు అవకాశాలు ఉండాలి అని అడిగారని.. దానికీ కుడా సరే అన్నామని చెప్పారు. జిల్లాలో బీసీ మహిళా అయిన జెడ్పీ చైర్మన్‌ను ఎక్కడికి రావొద్దన్నారని.. ఆమెను అధికార కార్యక్రమాలకు పిలవద్దు అన్నారని ఇది సాధ్యం కాదని తేల్చి చెప్పామని అన్నారు. మంగళవారం నాడు శ్రీనివాస్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఒక ఎమ్మెల్యే అయి ఉండి పార్టీలో అధికారులపై గ్రిప్ సంపాదించుకోవాలన్నారు. రాష్ట్రంలో పథకాలు అమలు కావడం లేదన్నారని.. అన్నీ చేసి చూపిస్తున్నామని తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కుంభకోణం గురించి ప్రజలందరికి తెలుసునని చెప్పారు.

# బీఆర్ఎస్ ఘర్‌వాపసీ..

### తెలంగాణ రాజకీయాల్లో సంచలనం
### తిరిగి సొంతగూటికి గద్వాల ఎమ్మెల్యే
### అదేబాటలో తెల్లం వెంకట్రావ్ ఉన్నట్లు ప్రచారం

హైదరాబాద్,జూలై30(సూర్య వాస్తవం): తెలంగాణలో రాజకీయాలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సహజంగానే విపక్ష పార్టీ నుంచి అధికార పార్టీలోకి ఎమ్మెల్యేలు, ఎంపీలు జంప్ అవుతుంటారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నుంచి ఇప్పటి వరకూ అలాగే జరిగింది. కానీ, ఇప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందంటూ ఇప్పటివరకు కాంగ్రెస్ నేతలు చేసిన ప్రకటనలకు విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. అవును.. బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలంతా ఇప్పుడు మళ్లీ సొంతగూటి వైపు చూస్తున్నారట. ఇప్పటికే గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి.. కాంగ్రెస్ వొద్దు బీఆర్ఎస్‌లోనే ఉంటానంటూ రిటర్న్ అయ్యారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన.. ఇప్పుడు మనసు మార్చుకుని సొంత పార్టీలోకి వచ్చేశారు. మంగళవారం నాడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఆయన.. తాను మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. అయితే, కృష్ణమోహన్ ఘర్‌వాపసీతో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగలగా.. బీఆర్ఎస్‌లో జోష్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు పార్టీని వీడి వెళ్లిన మిగతా ఎమ్మెల్యేలను సైతం తిరిగి రప్పించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది బీఆర్ఎస్ అధిష్టానం. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సైతం మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇవాళ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని తెల్లం వెంకట్రావ్ కలిశారు. అనంతరం కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఇవాళో రేపో ఆయన కూడా బీఆర్ఎస్‌లోకి పునరాగమనం చేస్తారని గట్టి ప్రచారమే నడుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 స్థానాల్లో మాత్రమే



గెలుపొంది.. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఆ పార్టీ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు వరుసగా బీఆర్ఎస్‌ను వీడటం మొదలుపెట్టారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దాదాపు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరే కాదు.. ఇంకో పది మందికి పైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని, బీఆర్ఎస్‌కు విపక్ష హోదా ఉండని కాంగ్రెస్ నేతలు గట్టి ప్రకటనలే చేశారు. ఆషాఢమాం అయిపోయిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని హస్తం పార్టీ నేతలు జోరుగా ప్రచారం చేశారు. ప్రకటనల పరంపర ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే, ఇక్కడే చిన్న ట్విస్ట్ చోటు చేసుకుంది. ఓవైపు చేరికలుంటాయని భావించిన కాంగ్రెస్‌కు.. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి రూపంలో రివర్స్ షాక్ తగిలింది. కాంగ్రెస్ వద్దు బీఆర్ఎస్ కావాలి అంటూ రిటర్న్ అయ్యారు. ఈయనొక్కరే కాదు.. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మరికొందరు ఎమ్మెల్యేలు సైతం తిరిగి సొంత గూటికి చేరుతారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పునరాగమనం దాదాపు ఫిక్స్ అవగా.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య కూడా తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతారని గులాబీ పార్టీ అగ్రనేతలు చెబుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతానికైతే ఎమ్మెల్యేల ఫార్వర్డ్, రివర్స్ జంపింగ్ గేమ్స్ నడుస్తున్నాయి. కాంగ్రెస్ నేతలైతే పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇందుకు ముహూర్తం కూడా ఫిక్స్ అయ్యిందని చెబుతున్నారు. మరోవైపు బీఆర్ఎస్ మాత్రం ఘర్ వాపసీ కార్యక్రమం చేపట్టింది. తమ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వాళ్లు తిరిగి వస్తారని, వారితో పాటు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సైతం తమ పార్టీలోకి వస్తారని గులాబీ పార్టీ పెద్దలు ప్రకటిస్తున్నారు. మరి రానున్న రోజుల్లో ఘర్ వాపసీ ఊపందుకుంటుందా? లేక కాంగ్రెస్ చెప్పినట్లు ఉన్నోళ్లను సైతం లాగేసుకుంటుందా? అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే.

## మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం

### – జిల్లా ఎస్పీ కే. వి మురళీకృష్ణ

అనంతపురం క్రైం (సూర్య వాస్తవం): మరణించిన పోలీస్ సిబ్బంది కుటుంబాల వారికి ఎల్లవేళలా అండగా ఉంటామని అన్నారు జిల్లా ఎస్పీ కే.వి మురళీకృష్ణ. జిల్లాలో ఇటీవల మృతి







చెందిన ఏఆర్ ఎస్సై, ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ కుటుంబాలకు కార్పస్ నిధుల కింద రూ. 2 లక్షల విలువ చేసే చెక్కులను జిల్లా ఎస్పీ మంగళవారం నాడు బాధితులకు అందజేశారు. జిల్లా ఏ.ఆర్ విభాగంలో పని చేస్తున్న ఏ.ఆర్ ఎస్సై హాజీపీరా, ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు నాయక్ లు ఇటీవల మృతి చెందారు. ఏ.ఆర్ ఎస్సై హాజీపీరా భార్య వహీదా, ఏ.ఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు నాయక్ భార్య పూజకు కార్పస్ ఫండ్ కింద చెరో రూ. ఒక లక్ష ప్రకారం మొత్తం రూ. 2 లక్షల విలువ చేసే చెక్కులు ఎస్పీ గారు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎస్బీ సి.ఐ ఇందిర, బి సూపరింటెండెంట్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, ఆనంద్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో మానవ అక్రమ రవాణాను అరికట్టవచ్చు : న్యాయమూర్తి ఎం.ఎస్ భారతి

పత్తికొండ టౌన్ (సూర్య వాస్తవం): మానవ అక్ర డిమ రవాణాను అరికట్టడంలో విద్యార్థుల సహాయ, సహకారాలు చాలా అవసరమని, అలాగే మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో తమ వంతు బాధ్యత వహించాలని పత్తికొండ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎం.ఎస్ భారతి అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మంగళవారం పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య



అతిథిగా జడ్జి ఎంఎస్. భారతి హాజరయ్యారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి మరియు అధ్యాపక బృందం జడ్జి ఎంఎస్ భారతి కి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్జి ఎంఎస్ భారతి మాట్లాడుతూ... విద్యార్థి జీవితం చాలా ముఖ్యమైనదని, విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో తమ వంతు పాత్ర పోషించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కోర్టులు మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో చర్యలు తీసుకుంటుందని వివరించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధురి మరియు అధ్యాపక బృందం జడ్జి ఎంఎస్ భారతి ని సన్మానించారు. ఈ సదస్సులో మండల న్యాయ సేవాధికారి సంస్థ ప్యానెల్ అడ్వకేట్స్ అశోక్ కుమార్, సూరజ్ నబి, న్యాయవాదులు రాజశేఖర్ నాయుడు, వీరేష్, నరసింహులు, కబీర్దాస్, నాగరాజు, కళాశాల అధ్యాపక బృందం మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో భూమాయ

**నేతల కబ్జాలో లక్షన్నర ఎకరాల భూమి**
**మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆరోపణ**

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): రాష్ట్రంలో వైసీపీ పాలనలో పెద్దఎత్తున భూదోపిడీ జరిగిందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఆరోపించారు. లక్షన్నర ఎకరాల భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారని విమర్శించారు. దేవాలయ, మఠం, ప్రభుత్వ భూముల దోపిడీ జరిగిందని మండిపడ్డారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం 14 మండలాల్లో భూ అక్రమాలకు పాల్పడిందన్నారు. వైసీపీ నేతలు భూ అక్రమాల పై ప్రభుత్వం సీరియస్ గా స్పందించిందని చెప్పారు. మంగళవారం నాడు మంత్రి రాం ప్రసాద్ రెడ్డి సచివాలయంలో తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు విచారణ కు ఆదేశించారని తెలిపారు. పెద్ద ఎత్తున 22ఏ భూముల రికార్డులు మదనపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ధ్వసం చేశారని అన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమాలు బయటపడతాయని రికార్డ్స్ కాల్చివేశారని చెప్పారు. అనేకమంది అధికారులు ఈ కుట్ర వెనుక పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోసం పనిచేశారన్నారు. ఆ అధికారులే భూ రికార్డుల కాల్చివేతకు పాల్పడ్డారని ఆరోపించారు. మదనపల్లి ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను కాల్చివేసిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని హెచ్చరించారు. అనేకమంది బాధితులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ భూ దోపిడీ పైన ఫిర్యాదులు చేస్తున్నారని అన్నారు. ప్రజలను బయపెట్టి పెద్దిరెడ్డి పెద్దఎత్తున దోపిడీ చేశారన్నారు. రూ.40 వేల కోట్లు భూ అక్రమాలు గత ప్రభుత్వం హయాంలో జరిగాయని స్పష్టం చేశారు. భద్రత కోసం కూడా పెద్దిరెడ్డి కుటుంబం చిల్లర రాజకీయాలు చేస్తుందని ధ్వజమెత్తారు. కావాలనే దాడుల సృష్టించుకొని , పోలీసుల వైఫ్యలం పేరుతో డ్రామా ఆడుతున్నారని ÷ర్ అయ్యారు. పరదల ముఖ్యమంత్రి పాలన పోయి.. రాష్ట్రంలో ప్రజా పాలన వచ్చిందని ఉద్ఘాటించారు. 60 రోజులు నుంచి రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొందని అన్నారు. గడిచిన ఐదేళ్లు గా రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని చెప్పారు. మదనపల్లి ఘటన పై జగన్మోహన్ రెడ్డి చర్చకు ఎక్కడకు వచ్చిన తాము సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తెలుగుదేశం నాయకులకు గన్ మాన్‌లను తొలగించారని గుర్తుచేశారు. ఆగస్టు 15వ తేదీన అన్న క్యాంటీన్‌లు ప్రారంభిస్తామని మంత్రి రాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# శవాలతో కాసుల వేట..

### అనంత మార్చురీ లో ప్యాకింగ్ సామాన్ల దందా...
### ఏపీ ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించిన ఆగని వసూళ్లు.

అనంతపురం వైద్యం(సూర్యవాస్తవం) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించినప్పటికి అనంతపురం మార్చురీ లో ఆగని అక్రమాలు.ప్యాకింగ్ వస్తువులకు 1500 వందల చొప్పున ఒక్కొక్క మృతదేహానికి వసూలు



చేస్తున్నారు. సగటున రోజుకు రెండు నుండి మూడు లేదా నాలుగు మృతదేహాలకు పోస్ట్ మార్టం నిర్వహిస్తారు.అంటే ఒక రోజుకు దాదాపు గా 4500 నుండి 6000 వరకు డబ్బులు వసూలు చేస్తున్నారు.నెలరోజులకు సగటున లక్ష నుండి లక్ష యాభై వేల వరకు వసూళ్లు జరుగుతున్నాయి.ఈరోజు జరిగిన పోస్ట్ మార్టం లో మృతుడు సిరివెళ్ల మండలం,నంద్యాల జిల్లా వాసి ఇయిన షేక్ గౌస్ పీర్ యొక్క అన్న షేక్ మాభాషా నుండి బలవంతంగా డబ్బులు వసూలు




చేశారని సదరు మృతి అన్న వాపోయారు.రోజు వారి కూలి పనిచేసుకుని జీవించే వారి వద్ద యిలా డబ్బులు వసూలు చేస్తూ పోతే ఎలాగా అంటూ సామాన్యులు లబోదిబోమంటున్నారు.ఇప్పటి కైనా మార్చురీ సిబ్బందిని మార్చాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

ఇండెంట్ అధికారి ఈశ్వర్ రెడ్డి వివరణ

మార్చురీ కి సంబంధించి ఇప్పటికే రెండువందల మీటర్ల క్లాత్ మెటీరియల్ ని అందించడం జరిగింది,మరి ఏందుకు డబ్బులు వసూలు చేస్తున్నారో మాకు తెలియదు.

## గర్నిమిట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

అన్నమయ్య సూర్య వాస్తవం



కె.వి పల్లి మండలం గర్నిమిట్టలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మరియు అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటగా జిల్లా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న అటెండెన్స్ రిజిస్టర్లు, ఓపి రిజిస్టర్లు మరియు మెడిసిన్స్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. మందులు అన్ని అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిత తనిఖీ చేస్తూ అక్కడ ఉన్న అంగన్వాడీ ఉపాధ్యాయురాలిని పిల్లలందరూ సమయానికి వస్తున్నారా, ఏ సమయాలకు భోజనం పెడుతున్నారు వంటి ప్రశ్నలు అడిగారు. గత మూడు రోజులుగా పిల్లలకు గుడ్లు అందుబాటులో లేవని అంగన్వాడి ఉపాధ్యాయురాలు తెలపగా, జిల్లా కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారం అందించాలని గుడ్లు అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆదేశించారు. మహిళా పోలీసును ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి నెల కనీసం రెండుసార్లు అయినా అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. గర్నిమిట్ట పశు వైద్యశాలను ఆకస్మిక తనిఖీ చేయగా అక్కడి స్థానికులు పశు



వైద్యశాలకు సంబంధించి కొన్ని ఫిర్యాదులు కలెక్టర్ కి అందించారు. ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ వారికి తెలిపారు.

అనంతరం కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యాలయంలో చదువుకుంటున్న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడుతూ భోజనం బాగుందా లేదా, పాఠాలు బాగా చెబుతున్నారా లేదా, వంటి ప్రశ్నలు అడిగారు. సొంతంగా ప్రశ్నలు వేసుకొని విశ్లేషణాత్మకంగా చదువుకోవాలని ఈ సందర్భంగా విద్యార్థినులకు సూచించారు.

## బాలికల పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేని కోరిన ఉపాధ్యాయనీయులు

నార్పల సూర్య వాస్తవం : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ప్రధానోపాధ్యాయుడు నాగేష్ ఆధ్వర్యంలో



పాఠశాల ఉపాధ్యాయినీయులు, విద్యార్థుల తలిదండ్రులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి ఉపాధ్యాయుల సంఖ్య చాలా తక్కువగా ఉందని దానికితోడు బోధ నేతర సిబ్బంది సమస్య కూడా ఉందని తెలిపారు. నార్పల బాలికల పాఠశాల జిల్లాలోనే గత 15 సంవత్సరాలుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ మంచి పేరు ఉందని ప్రస్తుతం సిబ్బంది కొరతతో తాము ఆ పేరుని నిలుపుకోలేక పోతామో అన్న ఆందోళన తమలో నెలకొందని ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద బాలికల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నార్పల బాలికల పాఠశాలలో నెలకొన్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ని ఉపాధ్యాయనీయులు, విద్యార్థుల తల్లితండ్రులు కోరారు. 960 విద్యార్థినిలు పాఠశాలలో ఉన్నారన్నారు. ఫిజిక్స్ సబ్జెక్టు బోధించడానికి నల్గురు ఉండాల్సిన చోట ఒక్క ఉపాధ్యాయులు లేరన్నారు. బయాలజీ కి నల్గురు ఉండాల్సిన చోట ఒక్క ఉపాధ్యాయనీ తో భోధన సరిపెట్టకుంటున్నమన్నరు. గణితం, ఆంగ్లం బోధనకు 5మంది చొప్పున ఉండలిసిన చోట ముగ్గురు మాత్రమే ఉన్నారు. సాంఘిక శాస్త్రం ఐదు మందికిగాను ఇద్దరు మాత్రమే ఉన్నారన్నారు. తెలుగు భోదనకు ఇద్దరు అవసరం ఉందన్నారు. ఇలాగైతే విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలంటే కష్టంగా ఉంటుందన్నారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జిల్లా ఉన్నత విద్యాధికారులతో మాట్లాడి బాలికల పాఠశాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు.

# దళితులకు ఆర్థిక భద్రత

**మొదటిపేజీ తరువాయి..**

పరిస్థితులపై సమావేశంలో చర్చించారు. గత ప్రభుత్వం గిరిజన సంక్షేమాన్ని నిర్వీర్యం చేసిన విధానాన్ని సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. గత ప్రభుత్వానికి గిరిజన సంక్షేమమనేది అత్యంత అప్రాధాన్యత శాఖగా చూసిందని అధికారులు వెల్లడించారు. 2014 నుంచి 2019 మధ్య అమల్లో ఉన్న పథకాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని అధికారులు తెలిపారు.

2014-19 మధ్య కాలంలో గిరిజన విద్యార్థుల కోసం తెచ్చిన ఎన్టీఆర్ విద్యోన్నతి, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాలను జగన్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని చెప్పారు. అలాగే గిరిజనులకు సత్వర వైద్యం కోసం తెచ్చిన పథకాలను గత ప్రభుత్వం రద్దు చేసిన విధానంపై సీఎం సమీక్ష జరిపారు. గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు, అరకు కాఫీ మార్కెటింగ్, ఇతర గిరిజన ఉత్పత్తుల అమ్మకాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది.



## భూ సర్వేపై జగన్‌ను ఫాలో కావాల్సిందే

### మాజీమంత్రి అంబటి రాంబాబు

గుంటూరు,జూలై30(సూర్య వాస్తవం): ఏపీలో భూ రీసర్వేపై అధికార ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతోంది. ఎన్నికలకు ముందు భూ రీసర్వే, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ద్వారా జగన్ ప్రజల భూములను దోచుకుంటాడంటూ ప్రచారం చేసింది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి. అయితే, అధికారంలోకి వచ్చాక భూ రీసర్వేకి సన్నాహాలు చేస్తోంది కూటమి ప్రభుత్వం. దీనిపై ప్రతిపక్ష వైసీపీ విమర్శలు మొదలు పెట్టింది. ఎన్నికల్లో దుష్ప్రచారం చేసి ఇప్పుడు యు టర్న్ తీసుకున్నారంటూ ఆరోపిస్తోంది వైసీపీ. ఈ క్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు చంద్రబాబుపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి గొప్ప చట్టం రద్దు చేసామని చెబుతున్నాడు గానీ.. చివరికి దాని పేరు మార్చి మళ్ళీ అమలు చేస్తాడని అన్నారు. ఇప్పటికే జగన్ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 6వేల గ్రామాల్లో భూ రీసర్వే చేయటం జరిగిందని అన్నారు. ఎవరైనా జగన్ ను ఫాలో అవ్వాల్సిందేనని అన్నారు.యూటర్న్‌లో చంద్రబాబుది గిన్నిస్ రికార్డని ఎద్దేవా చేశారు.ఎన్నికల ముందు ఒక మాట, ఎన్నికల తరువాత ఒక మాట చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు.మేనిఫెస్టోలో పెట్టిన హామీలు ఎగ్గొట్టడం కోసం సాకులు చెబుతున్నాడని అంబటి అన్నారు .

## గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో తాగునీటి కష్టాలు

### మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడి

విజయవాడ,జూలై30(సూర్య వాస్తవం): వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తాగునీటి కష్టాలు వచ్చాయని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఐదేళ్లలో కాల్వల్లో పారెడు మట్టి కూడా తీయలేకపోయారని మండిపడ్డారు. కాల్వల మరమ్మతులు చేయకుండా బిల్లులు చేసుకున్నారని విమర్శించారు. మంగళవారం నాడు నీటిపారుదల సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రొ కొల్లు రవీంద్ర మాట్లాడుతూ... పట్టిసీమ పంపులను పక్కన పడేయాలని చూశారని విమర్శించారు. 40 టింసిల నీరు నిలబెట్టగలిగే పులిచింతలలో 0.8 లెవల్‌కు పడేశారన్నారు. సాగర్, శ్రీశైలంలో నీళ్లు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి వచ్చాక పులిచింతలను మళ్లీ అందుబాటులోకి తెచ్చామని ఉద్ఘాటించారు. 21 పంపుల ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించామని వివరించారు. వ్యవసాయానికి 10వేల క్యూసెక్కుల సాగునీరు అవసరం ఉందని వెల్లడించారు.ప్రకాశం బ్యారేజ్ దగ్గర 5వేల క్యూసెక్కుల నీళ్లే ఉన్నాయన్నారు. 10వేల క్యూసెక్కుల నీళ్లు కావాలంటే పై నుంచి నీళ్లు రావాలని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి కేఆర్ఎంబీ నుంచి 10వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చేలా కృషి చేస్తామని మాటిచ్చారు. ఇంకా 4వేల కేసుల వరకు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రూ.480 కోట్లు రావల్సి ఉండగా ఒక్క కృష్ణాజిల్లాలోనే రూ.45కోట్లు రావల్సి ఉందని స్పష్టం చేశారు. త్వరలోనే బిల్లులు విడుదలయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

## గన్నవరంలో వైసిపి కార్యకర్తల హంగామా

### జగన్‌కు స్వాగతం పలికేందుకు వచ్చి రచ్చ

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన సతీమణి భారతి బెంగళూరు పర్యటన ముగించుకుని మంగళవారం నాడు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. వైసీపీ ముఖ్యనేతలు, కార్యకర్తలు జగన్‌కు భారీ స్వాగతం పలికారు. గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి జగన్ తాడేపల్లి నివాసానికి వెళ్లనున్నారు. అయితే, గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో జగన్ కోసం వచ్చిన కార్యకర్తలు పోలీసులపై అత్యుత్సాహం ప్రదర్శించారు.జగన్ సెక్యూరిటీగా వచ్చిన గన్నవరం ఎస్‌ఐను తోసేశారు. ఎస్‌ఐ భుజం మీద చేయి వేసి జగన్ కార్యకర్తలు గొడవకు దిగారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే అనిల్ సమక్షంలోనే ఈ తతంగం జరిగింది. పోలీసులపై దాడికి దిగిన వ్యక్తులను అదుపులోకి తీసుకునేందుకు గన్నవరం పోలీసులు ప్రయత్నించారు. పోలీసులను నెట్టి జగన్ కాన్వాయ్ వెంట వేరే కారులో వైసీపీ కార్యకర్తలు పరారయ్యారు. అయితే, వారం రోజులపాటు జగన్ బెంగళూరులో ఉన్న విషయం తెలిసిందే. జగన్ బెంగళూరు వెళ్లే ముందు తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించాలని ప్లాన్ చేసుకున్నారు. పార్టీ నాయకులు, ప్రజలను కలిసేందుకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. కానీ సడన్‌గా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేసుకుని జగన్ బెంగళూరు వెళ్లారు.మను కలవకుండా బెంగళూరు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చిందని వైసీపీ నేతలు కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో కూడా జగన్ పాల్గొనలేదు. గత నెల 24న కూడా ఆయన సతీసమేతంగా బెంగళూరు వెళ్లారు. ఈ నెల 2న తిరిగి తాడేపల్లి ప్యాలెస్ చేరుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరపరాజయం, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకపోవడం జగన్‌ను తీవ్ర నిరాశా నిస్పృహలకు గురిచేసిందని.. ఓటమి బాధ నుంచి బయటపడలేకపోతున్నారని వైసీపీ వర్గాలే అంటున్నాయి.

## జగన్ ప్రతిపక్షంలో ప్రజల తరపున పోరాడాలి

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి,జూలై30(సూర్య వాస్తవం): అన్నమయ్య జిల్లాలోని మదనపల్లిలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో దొంగలు పడ్డారు అని ఆరోపించారు. రెవెన్యూ దొంగలను కఠినంగా శిక్షించాలి.. పేదల భూములను బలవంతంగా కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి అని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉంటూ ప్రజల తరపున పోరాడాలి అని సూచించారు. అసెంబ్లీకి వెళ్లి అధికార పక్షం చేసే తప్పులను ఎండగట్టాలి అని పేర్కొన్నారు. వైఎస్ జగన్ అసెంబ్లీకి వెళ్లకుండా ఉండిపోవడాన్ని తప్పుపడుతున్నామని సీపీఐ రామకృష్ణ అన్నారు. ఇక, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలని అమలు చేయాల్సిందే అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు. రాష్ట్రంలో కృష్ణ, తుంగభద్ర, గోదావరి నదులకు వరదలు వస్తున్నాయి.. కానీ రాయలసీమలో వర్షాలు కురవక కరువు తాండవిస్తోంది అని చెప్పుకొచ్చారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి కృష్ణా జలాలను హంద్రీనీవా ద్వారా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు సరఫరా చేయాలి అని సూచనలు చేశారు. సీఎం చంద్రబాబు కరువు జిల్లాలో పర్యటించాల్సిన అవసరం ఉంది అని సీపీఐ రామకృష్ణ తెలిపారు.

## భక్తులకు పరిశు భ్రమైన ఆహారం

### హోటల్ యజామనులకు టిటిడి ఇవో ఆదేశాలు

తిరుమల,జూలై30(సూర్య వాస్తవం): తిరుమలకు వచ్చే భక్తులకు హోటళ్లలో పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలని టీటీడీ ఈవో జె. శ్యామలరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో పెద్ద, జనతా క్యాంటీన్లు, ఏపీటీడీసీ హోటళ్లపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. హోటళ్లతో సహా అన్ని తినుబండారాల విక్రయ ప్రాంతాలలో వ్యర్థాలను తొలగించేందుకు రెండు డస్ట్ బిన్ల వ్యవస్థను నిర్వహించాలని తెలిపారు. భక్తుల నుంచి అభిప్రాయాన్ని పొందడానికి ఫిర్యాదులు, సూచనల పె÷–టటెను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని హోటళ్లలో చెత్తను తడిచెత్త, పొడి చెత్తగా సేకరించాలన్నారు. హోటళ్ళు ఆహార పదార్థాల ధరలతో ప్రదర్శన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హోటల్ లైసెన్స్ పొందిన వారు వాటిని ఎటువంటి సబ్ లీజుకు ఇవ్వరాదని, సవరించిన ధరలను రెవెన్యూ విభాగానికి అందజేయాలని సూచించారు. వాటర్ బాటిళ్ల ను రూ.20కి మించి అమ్మకూడదని, తనిఖీ సమయంలో నిర్దేశిరచిన మార్గదర్శకాలను ఉల్లంఘించి నట్లు తేలితే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవోలు , జేఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

## మోడీ పాలనలో దేశం అప్పుల భారత్

మోడీ పాలనలో ఆంధ్రప్రదేశ్ కు చిప్ప

డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

వేంపల్లి.సూర్య వాస్తవం: మోడీ పాలనలో దేశం అప్పుల భారత్ అయింది. 1947 నుంచి 2014 వరకు 67 సంవత్సరాలలో పండిట్ నెహ్రూ మొదలుకొని మన్మోహన్ సింగ్ వరకు 13 మంది ప్రధానుల కాలం లో కేంద్ర ప్రభుత్వం చేసిన మొత్తం అప్పు 46 లక్షల కోట్ల రూపాయలు. 2014 నుంచి 2024 వరకు 10 సంవత్సరాలలో మోడీ ప్రభుత్వం చేసిన అదనపు అప్పు 126 లక్షల కోట్ల రూపాయలు. 31- 3 - 2024 నాటికి కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పు రు



171.78 లక్షల కోట్లు. 2024 - 25 ఆర్థిక సంవత్సరం లో చేయబోయే అప్పు రు 13.49 లక్షల కోట్లు. 31-3-2025 నాటికి మొత్తం అప్పు రు 185.27 లక్షల కోట్లు. ఈ విధంగా మోడీ ప్రభుత్వం దేశాన్ని అప్పులకుప్ప చేసింది. మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి గత 10 సంవత్సరాలుగా అన్యాయం చేయడమే కాకుండా ఈ సారి బడ్జెట్లో కూడా అన్యాయం చేసింది. రాజధాని అమరావతికి గ్రాంట్ కాకుండా అప్పు ఇస్తానంటోంది. ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఊసే లేదు. దుగరాజపట్నం ఓడ రేవు అంశమే లేదు. విశాఖ మెట్రోరైలు,విజయవాడ మెట్రో రైల్,విశాఖ రైల్వే జోన్ ప్రస్తావన లేదు. సెంట్రల్,గిరిజన యూనివర్సిటీ లకు, ఐఐటి, ఐఐమి, ఎన్ ఐ టీ, ఐ ఐ ఎస్ ఇ ఆర్ , ఐ ఐ ఐ టి,ఎయిమ్స్ లకు నిధుల కేటాయింపు లేదు. రు 25000 కోట్ల ఎరువుల సబ్సిడీ కోత ద్వారారైతులకు,రు 7082 కోట్ల ఆహార సబ్సిడీ కోత ద్వారా పేదలకు,రు 315 కోట్ల గ్యాస్, పెట్రోల్, డీజల్ సబ్సిడీ కోత ద్వారా మహిళలు,యువతకు మోడీ ప్రభుత్వం అన్యాయం చేసింది. మోడీ పాలన చీకటి పాలన,తిరోగమన పాలన అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి మోడీ ప్రభుత్వం పై విరుచుకు పడ్డారు.

## తేలు కుట్టి చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి



సిద్దవటం సూర్యవాస్తవం మండలంలోని శాఖరాజుపల్లి గ్రామ పంచాయతీ బాపనపల్లి గ్రామానికి చెందిన ఎటూరి పిచ్చయ్య (57) అనే కౌలు రైతు తేలు కుట్టి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు మృతుని భార్య లక్ష్మిదేవి, కుమారుడు హరి లు తెలిపారు. ఎటూరి పిచ్చయ్య రజక వృత్తిని చేసుకుంటూ 70 సెంట్లు భూమిని కౌలుకు తీసుకుని అరటి పంటను సాగు చేశాడు. ఈ నెల 22వ తేదిన అరటి పంటలో కలుపు తీసేందుకు పిచ్చయ్య పొలంలోకి వెళ్లగా విష పురుగు కాటు వేసింది. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు అతన్నిహుటా హుటిన కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు తేలు కుట్టినట్లు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉన్న అతన్ని వెంటిలేటర్ పై చికిత్స అందించారు. ఈ మేరకు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుని కుమారుడు హరి రిమ్స్ ఔట్ పోస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిర్వహించారు. తాము పూరి గుడిసెలో నివసిస్తూ జీవిస్తున్నామని కుటుంబ పెద్దను కోల్పోయామని తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## గంజాయి నిర్మూలనపై దృష్టి సారించాలి

కడప బ్యూరో సూర్యవాస్తవం

కడప జిల్లాలో గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర హోం మంత్రి అనిత సూచించారు. వైజాగ్ నుంచి మంగళవారం



హోంమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కడప ఎస్పీ కార్యాలయం నుంచి ఎస్పీ హర్షవర్ధన్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి నిర్మూలనే లక్ష్యంగా రూపొందించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుకు, గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్పీ కు సూచించారు.

## ఏ.ఆర్ సిబ్బంది సంక్షేమానికి చర్యలు

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప బ్యూరో సూర్యవాస్తవం

ఏ.ఆర్ పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఏ.ఆర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏ.ఆర్ పోలీస్ అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏ.ఆర్ పోలీసులు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. గార్డు విధులు, ఎస్కార్ట్ విధులు, వ్యక్తిగత భద్రతా అధికారుల (పి.ఎస్.ఓ) నిర్వహించే సిబ్బంది వివరాలు ఏ.ఆర్ అదనపు ఎస్పీ కృష్ణారావును అడిగి తెలుసుకున్నారు.




## గల్ఫ్ దేశాలకు తరలించే నకిలీ ఏజెంట్ల,కార్యాలయాల పై దృష్టి సారించాలి

ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు కేసి.బాదుల్లా

కడప బ్యూరో సూర్యవాస్తవం

పొట్ట కూటి కోసం (అరబ్) గల్ఫ్ దేశాలకు పోతున్న వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి నకిలీ ఏజెంట్లును నమ్మి ఉపాది కోసం లక్షలు రూపాయలు పోగొట్టుకొని మగ్గిపోతున్న వారిని వారి సొంత ఇంటికి పిలిపించేటట్లు చర్యలు తీసుకోవాలని ఇన్సాఫ్ కడప జిల్లా అధ్యక్షులు కేసి.బాదుల్లా విజ్ఞప్తి చేశారు. మంగళవారం కడప నగరంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పేదలు స్థానికంగా పనులు దొరకక దుబాయి, మస్కట్, కువైట్, సౌదీ ఖతార్ లాంటి దేశాలకు వెళ్తుంటారని, వారి ఆశను ఆసరా చేసుకొని కొందరు ప్రైవేట్ ఏజెంట్లు వారిని అక్రమ మార్గంలో అరబ్ దేశాలకు పంపుతున్నారన్నారని అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గల్ఫ్ దేశాల్లో కొంతమందిని బానిసల్లా మార్చుకొని వారిని చిత్రహింసలకు గురిచేస్తూ పనులు చేయించుకుంటారన్నారని, అక్కడి వారు పెట్టే బాధలు భరించలేక ఆత్మహత్యలు సైతం చేసుకుంటున్నారని, ప్రధానంగా ఆడపిల్లలను అక్కడ శారీరకంగా, లైంగికంగా హింసిస్తున్నారని, సరైన పద్ధతిలో వెళ్లకపోవడం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయన్నారు. ప్రైవేట్ ఏజెంట్లు సొమ్ముకు ఆశపడి అక్కడికి అక్రమ




మార్గంలో పంపుతున్నారని, అక్కడి వారు సైతం తప్పుడు మార్గంలో ఆడపిల్లలను ఆఫీసు (కార్యాలయాలు) ద్వార రప్పించుకొని వారితో వెట్టిచాకిరి చేయిస్తూ హింసలకు పాల్పడుతున్నారన్నారని ఆరోపించారు. అరబ్ దేశాలకు వెళ్లే వారీని ప్రభుత్వ వ్యవస్థల ద్వారా నమోదు ఉండాలన్నారు. చాలా మంది అవగాహన లేకనే ప్రైవేట్ ఏజెంట్ల మోసానికి బలవుతున్నారన్నారు. కేరళ రాష్ట్రం తరహాలో రాష్ట్రంలో ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేసి జిల్లా కలెక్టర్ కలెక్టర్ కార్యాలయాలకు అనుసంధానం చేసి గల్ఫ్ బాధితుల కోసం సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాలనీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. గౌస్, నగర సహాయ కార్యదర్శి ఎస్.హుస్సేన్, నాయకులు యన్.దస్తగిరి పాల్గొన్నారు.

## డెంగీ జ్వరం.... చాలా ప్రమాదకరం

అవగాహన పెంచుకుందాం... రక్షణ పొందుదాం

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): డెంగీ జ్వరం చాలా ప్రమాదకరమని వైద్యులు తెలుపుతున్నారు. ఈ డెంగీ జ్వరం గురించి అవగాహన పెంచుకొని, రక్షణ పొందాలని నిపుణులు పేర్కొంటున్నారు. డెంగీ గురించి కాస్త తెలుసుకుందాం డెంగీ లక్షణాలు: డెంగీ వ్యాధి లక్షణాలు సాధారణంగా వైరస్ సంక్రమణ తర్వాత 4-10 రోజుల్లో కనిపిస్తాయి. డెంగీ లక్షణాలు మెల్లగా ప్రారంభమై, తీవ్రంగా మారవచ్చు. ముఖ్యమైన



లక్షణాలు: తీవ్రమైన జ్వరం, తీవ్ర తలనొప్పి, కంటి ముళ్ల వెనుక తీవ్ర నొప్పి, సందుల మరియు కండరాల నొప్పి, బోన్ బ్రేక్ ఫీవర్ అని కూడా అంటారు, ఎందుకంటే ఈ నొప్పులు చాలా తీవ్రమైనవిగా ఉంటాయి. కడుపు నొప్పి, చర్మపు దద్దుర్లు, చర్మంపై ఎర్రగా ఉండే దద్దుర్లు, ఉబ్బసం, రక్తస్రావం అవుతుంటాయి. డెంగీ వ్యాధి నివారణకు సరైన వ్యాక్సిన్ లేకపోవడంతో, దోమలను నియంత్రించడం మరియు వ్యక్తిగత రక్షణే ప్రధాన మార్గాలు. దోమలు నివారించడం, దోమలు కుట్టకుండా ఉ ండేలా కీపింగ్ దోమలు ఉండే ప్రదేశాలలో ఉండకండి. దోమల నివారణకు ఇన్సెక్ట్ రిపెల్లెంట్లు ఉపయోగించండి. దోమల వలలు లేదా కిటికీలకు మరియు తలుపులకు దోమల నివారణ జాలర్లు ఏర్పాటు చేయాలన్నారు. డెంగీ వ్యాధి కోసం సకాలంలో సరైన వైద్య చికిత్స అవసరం. తీవ్రమైన పరిస్థితులు ఉంటే, ఆసుపత్రిలో చేరడం అవసరం అవుతుంది.

## నకిలీ హాలోగ్రామ్ లతో మద్యం సరఫరా

మొదటిపేజీ తరువాయి..

కట్టబెట్టినట్టు విచారణలో వెల్లడైంది. ఎక్స్ పీరియన్స్ సర్టిఫికెట్లు లేకుండానే ఆయ కంపెనీలకు బెవరేజెస్ కార్పోరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డి టెండర్లు ఇచ్చేసినట్టు విచారణలో తేటతెల్లమైంది. జీఎస్టీ లావాదేవీల సమాచారం, గతంలో చేసిన వ్యాపారం వివరాలు లేకుండానే టెండర్లు కట్టబెట్టేసినట్టు విచారణలో స్పష్టమైంది. హోలో గ్రామ్ టెండర్లకు సంబంధించిన కీలక సమాచారం గల్లంతైనట్టు విచారణలో వెల్లడించారు. టెండర్ల ఖరారు ప్రక్రియలో సాంకేతిక కమిటీ నివేదికపై అధీకృత సంతకాలు లేనట్టు విజిలెన్సు అధికారులు గుర్తించారు. సాంకేతిక కమిటీ సమావేశం మినిట్స్ కూడా గల్లంతైనట్టు గుర్తించారు.



## గుజరి మండీలో అగ్ని ప్రమాదం

రూ. 2 లక్షల ఆస్తి నష్టం

మదనపల్లె క్రైమ్ సూర్య వాస్తవం న్యూస్ : మదనపల్లె పట్టణం, గొల్లపల్లి రింగ్ రోడ్డు లోని ఓ గుజిరి మండిలో సోమవారం



రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగింది. అగ్నిమాపక అధికారి శివప్ప, టూ టౌన్ సిఐ యువరాజ్ తెలిపిన వివరాలు.. స్థానిక గొల్లపల్లిలో కాపురం ఉంటున్న సయ్యద్ హుస్సేన్ గుజరీ వ్యాపారం చేస్తున్నాడు. రాత్రి10 గంటల ప్రాంతంలో కరెంట్ షాక్ సర్క్యూట్ వలనో లేక ఎవరైనా సిగరెట్ తాగి పడేయం కారణంగానో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో మండిలోని సామాగ్రి కాలిపోయింది. సమాచారం అందుకున్న రెండవ పట్టణ సీఐ యువరాజు సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వెంటనే వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మదనపల్లె లో రెండు ఇళ్లల్లో చోరీ చేసిన దొంగలు

మదనపల్లె క్రైమ్ సూర్య వాస్తవం న్యూస్ : మదనపల్లె మండలం, తట్టువారిపల్లి, బోడుమల్లు దిన్నెలో దొంగలు రెండు ఇళ్లల్లో చోరికి పాల్పడ్డారు. ఇంట్లోకి చొరబడి నగలు, నగదును దోచుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం వెలుగు చూసింది. మదనపల్లె మండలం, తట్టివారిపల్లె సమీపంలోని శ్రీవారి నగర్ లో ఉపాధ్యాయుడు గురుమూర్తి నివాసముంటున్నారు. ఆదివారం కుటుంబ సభ్యులందరూ ఇంటికి తాళాలు వేసి కలికిరి లో జరుగుతున్న జాతరకు వెళ్లారు. ఇంటికి తాళాలు వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలను తెరిచి అందులో ఉన్న విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకెళ్లి నట్లు బాధితులు వాపోతున్నారు. సుమారు రూ. 5 లక్షలకు పైగా విలువైన వస్తువులు, నగదు అపహరణకు గురైనట్లు తాలుక పోలీసులు పిర్యాదు చేశారు. అలాగే బోడిమల్లు దిన్నెలో ఉండే పాల రెడ్డెప్ప ఇంట్లో దొంగలు తాళాలు పగలగొట్టి డబ్బు, బంగారు ఎట్టుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై విచారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## రెక్కాడితే గాని డొక్కాడని రైతులు

- కలుపు యంత్రం లాగుతున్న భార్యాభర్తలు

దువ్వూరు,సూర్య వాస్తవం : వ్యవసాయం చేయాలంటే రైతులు ఆందోళన చెందుతున్నారు. అయితే అటు ఉద్యోగాలు లేని వారు, ఇటు వ్యాపారం చేయలేని వారు, భూమి ఉన్న వారు వ్యవసాయం చేయక తప్పలేదు. రైతుకు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఏర్పడింది. పంట పెట్టుబడులు యంత్రంతో కలుపు మొక్కలు తీస్తున్న రైతు ఎక్కువై పంటలు సరిగా రాక, వచ్చిన దిగుబడులకు గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దువ్వూరు మండలంలో ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే మిరప పంట,మొక్కజొన్న, పసుపు,మినుము, కాకర,బెండ,తదితర పంటలను సాగుచేశారు. మండల పరిధిలోని చిన్న సింగన పల్లె, గొల్లపల్లె,చల్లభాసాయపల్లె, మదిరేపల్లె ,నీలాపురం,దాసరిపల్లె, మూడిండ్లపల్లె, రామ్ సాయి నగర్,గడిపాడు,మిర్జాఖాన్ పల్లె,రామాపురం తదిత గ్రామాలలో పంటలు సాగు చేశారు.



అయితే గడిపాడు గ్రామానికి చెందిన రైతు తిరుపతి శ్రీనివాసులరెడ్డి భార్య స్వాతి లు సాగుచేసిన బెండ పంటలో కలుపు తీసేందుకు కూలీలు ఎక్కువ అడుగుతున్నారని భార్య భర్తలు చిన్న చేతి యంత్రంతో పొలంలో గడ్డి తీసేందుకు దున్నుతున్నారు. రైతు తిరుపతి శ్రీనివాసులరెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంత కష్టం చేసినా చివరకు మాకు నష్టాలే వస్తున్నాయి తప్ప లాభాలు రావడం లేదనిశ్రీనివాసులరెడ్డి తెలుపుతున్నారు .ఈ సంవత్సరమైనా గిట్టుబాటు ధరలు వచ్చి పంటలు దిగుబడి బాగా వస్తే అంతో ఇంతో చేతికి వస్తే పిల్లల చదువుకు, ఇంటి ఖర్చులకు వస్తుందని ధీమాతో బెండ పంటసాగు చేశామని ఆ రైతు తెలిపారు .గత సంవత్సరము పంటలు సాగు చేయగా పూర్తిగా దెబ్బ తినడంతో రేట్లు కూడా అధికంగా ఉన్నాయి, రేట్లు ఉన్నప్పుడు పంట చేతికి రాకపోగా, ఆ పొలంలో మినుము పంటను సాగు చేయగా అందులో నష్టాలు వచ్చినట్లు రైతు తెలిపారు.ఏది ఏమైనా రైతు పరిస్థితి రోజురోజుకు దిగజారుతుందని ప్రభుత్వాలు రైతులకు సహాయ సహకారాలు అందించి అన్నింటిలోనూ రైతులకు చేయూత నివ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలి

ప్రొద్దుటూరు, (సూర్య వాస్తవం): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక వైఎంఆర్



కాలనీలోని డిసిసి కోఆపరేటివ్ బ్యాంక్ ను పర్యవేక్షించారు. బ్యాంక్ నందు ఉ ద్యోగస్తులతో మాట్లాడి బ్యాంక్ సేవలను గురించి తెలుసుకున్నారు. బ్యాంక్ ఆవరణమంతా ఉద్యోగస్తులతో కలసి తిరిగి పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ డిసిసి కోఆపరేటివ్ బ్యాంక్ పట్ల ఖాతాదారులకు నమ్మకం అధికంగా ఉందని, కావున వారికి బ్యాంక్ లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

## పార్థివదేహానికి మాజీ మంత్రి పల్లె నివాళులు

నల్లచెరువు జులై 30 సూర్య వాస్తవం

మండల పరిధిలోని పల్లెవాండ్లపల్లికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త హనుమంతు సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మంగళవారం ఉదయం హనుమంతు స్వగ్రామమైన పల్లెవాండ్లపల్లికి చేరుకొని హనుమంతు పార్టీవదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమంతు తెలుగుదేశం పార్టీలో సీనియర్ కార్యకర్తగా మంచి గుర్తింపు పొందాలన్నారు.తెలుగుదేశం పార్టీ ఒక మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు.హనుమంతు కుమారుడు వెంకటరమణ ఎంతో నమ్మకంగా చాలా కాలం నుండి పీవీ కేకే పీజీ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్గా పనిచేస్తున్నారన్నారు. అనంతరం హనుమంతు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.హనుమంతు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు వాదలపల్లి అబ్దుల్ ఖాదర్,మాజీ జెడ్పిటిసి నాగభూషణ్ నాయుడు, నాయకులు దేవేంద్ర,రమణారెడ్డి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి

### దేశంలో రైతుల ఆత్మహత్యలు అరికట్టాలి

### దేశంలో రాజకీయాలను కార్పొరేట్లు శాసిస్తున్నారు

### కేంద్రం బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడడం సిగ్గుచేటు

### సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

మదనపల్లె క్రైమ్ సూర్య వాస్తవం న్యూస్: దేశంలో ఏ వర్గానికి లేని ఇబ్బందులు, సమస్యలు రైతాంగం ఎదుర్కొంటోందని, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్వీర్ కళ్యాణ మండపంలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మేళనం లో రెండవ రోజు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గత పదేళ్ల కేంద్రం ప్రభుత్వ పాలనలో దేశంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు . ప్రపంచంలోనే అతిపెద్ద పోరాటం డిల్లీ రైతాంగ పోరాటం అని అభివర్ణించారు. దేశ సంపద అంతా కార్పొరేట్ శక్తులకు కట్టపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం పాలన చేస్తోందని ఆరోపించారు. దేశ రాజకీయాలను కార్పొరేట్లు శాసిస్తున్నారని,వారి ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పరిపాలన సాగించడం సిగ్గు చేటన్నారు. గత పదేళ్లలో దేశంలో ఎవరి సమస్యలు పీఎం పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీల నేతలను వామపక్షాలను,ప్రశ్నించే వామపక్ష మేధావులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతూ బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నాడని విమర్శించారు.

పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికినా ప్రజలు తగిన బుద్ధి చెప్పి 60 సీట్లు తగ్గించారన్నారు. గడిచిన ఐదేళ్లు జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో అరాచక పాలన సాగించి, పరిపాలన గాలికి వదిలేశారని విమర్శించారు.మంత్రులు, ఉప ముఖ్యమంత్రులు కలిసేందుకు కూడా అపాయింట్మెంట్ ఇవ్వలేదని దుయ్యబట్టారు. సామాజిక న్యాయం అంటూ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన జగన్ కు ప్రజలే తగిన బుద్ధి చెప్పారన్నారు. రాష్ట్రానికి పూర్తిగా న్యాయం జరగాలంటే కేంద్ర బడ్జెట్ లో రూ. 15వేల కోట్ల అప్పుగా కాకుండా గ్రాంటుగా ఇవ్వాలని, వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో టీడిపి కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్




పథకాలను అమలు చేసి ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి ఈశ్వరయ్య, కెవివి ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు కాటమయ్య, జమలయ్య, జగన్నాథం, రామానాయుడు, అప్పల నాయుడు, దేగా ప్రభాకర్, ఏపీ ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తోపు కృష్ణప్ప, సాంబశివ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, సీపీఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

# అంతులేని లేని అభిమానం

## 50 అడుగుల పైనుంచి క్రేన్ ద్వారా డిసిఎం పవన్ కళ్యాణ్ బ్యానర్ విడుదల చేసిన అభిమానులు

కుప్పం జూలై 30 (చిత్తూరు జిల్లా) సూర్య వాస్తవం
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ కు తమిళనాడు



రాష్ట్రంలో కూడా వేలకొద్దీ అభిమానులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతమైన తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా వేపనపల్లి తాలూకా కత్తిరిపల్లి గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ అభిమానులు అనేక సేవా కార్యక్రమాలు చేస్తుంటారు.అదే గ్రామానికి చెందిన పవన్ కళ్యాణ్ అభిమాని పి.మురళి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జనసేన అభిమానులు వేపనపల్లి సమీపంలోని కారి కుప్పం పశ్చిమలై మురుగన్ గుడికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు.ఆ గుడి ఆవరణలో సోమవారం అత్యంత భక్తి శ్రద్ధలతో తమ వీపుకు కొక్కీలు తగిలించుకుని సుమారు 50 అడుగుల పై నుండి క్రేను ద్వారా చూపరులకు ఒళ్ళు గగుర్పొడిచేలా వేలాడుతూ ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బ్యానర్ ను విడుదల చేసి ఆయనపై తమకున్న అభిమానాన్ని ఈ రకంగా చాటుకున్నారు. అనంతరం ఆయన అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటూ పవన్ కళ్యాణ్ బ్యానర్ తో ఊరేగింపు చేపట్టారు.

# ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసిన కాంట్రాక్ట్ కార్మికులు

గుంతకల్లు, (సూర్య వాస్తవం) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవుని సోమవారం విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగస్తులు కలిసి



వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగస్తులు దళాల వ్యవస్థను రద్దుచేసి కార్మికులుగా గుర్తించి విద్యుత్ సంస్థలే జీతాలు ఇవ్వాలన్నారు. పది సంవత్సరాలు పూర్తి చేసిన వారిని ఇన్సెంటు ఇస్తామన్నారు. ఇంకా ఇవ్వలేదు వీటితోపాటు మాకు చాలా సమస్యలు ఉన్నాయి వెంటనే పరిష్కరించే దిశగా చూడాలని కోరారు. అనంతరం ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ త్వరలో మీకున్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణస్వామి, సుధాకర్, బాబు, అజయ్ కుమార్, నాగరాజు దేవేంద్ర, నాయక్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# అటవీశాఖ చెక్ పోస్టుల వద్ద వాహనాలు తనిఖీ

సిద్దవటం సూర్య వాస్తవం: సిద్ధవటం, అట్లూరు ఫారెస్ట్ అటవీశాఖ చెక్ పోస్ట్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేసినట్లు రేంజర్



కళావతి తెలిపారు. ఈ సందర్భంగా రేంజర్ కళావతి మాట్లాడుతూ వన్యప్రాణుల వేట, ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎర్రచందనం, వన్యప్రాణుల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే వెంటనే అటవీ శాఖకు తెలియజేయాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

# కొత్తచెరువుకు విస్తీర్ణం చూపించాలి

## –ఆక్రమణకు గురవుతున్న చెరువు

వీరబల్లి సూర్య వాస్తవం: మండలంలోని వీరబల్లి పంచాయితీ కొత్తచెరువు కు సంబంధించిన విస్తీర్ణం చూపించాలని అదేవిధంగా కొందరు రైతులు చెరువు ఆక్రమణకు గురవుతున్నారని రైతులు స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ చెరువులో ముళ్ల తంతికూడా నాటడం జరిగిందని చెరువు నిండిన సమయంలో రైతులకు ఇబ్బందిగా ఉంటుంది అన్నారు. ఈ చెరువు యొక్క హద్దులు చూపించి ఆక్రమణచేసిన వారిపై తగుచర్యలు తీసుకోవాలని తెలుగుదేశం నాయకులు కోరారు.



# ఉపాధి హామీ పనుల విషయంలో అధికారులు అలసత్వం వీడాలి

## – ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, సూర్య వాస్తవం:
ఉపాధి హామీ పనుల విషయంలో అధికారులు అలసత్వం వీడాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా గ్రామీణ ప్రాంతాల రైతులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి బాటలో పైనించేలా చేయాలని తెలిపారు. పర్యవేక్షణ చేస్తూ ఉపాధి హామీలను పరిశీలించాల్సిన అధికారులు పట్టణాల్లో నివాసం ఉంటూ గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని వీటిని సహించేది లేదన్నారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి ఉపాధి హామీ పనులను పరిశీలించి ఏ మేరకు పనులు జరుగుతున్నాయో నివేదికలు తయారు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల అభివృద్ధి కోసం ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికితేవాలన్నారు. తాము ప్రభుత్వం తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామసభలు ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతులతో మాట్లాడి ఉపాధి హామీ పట్ల వారికి అవగాహన కల్పించాలన్నారు సబ్సిడీ గురించి తెలియజేయాలన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు నామమాత్రపు సభలు మాత్రమే




నిర్వహిస్తున్నారన్నారు. రైతు కష్టానికి ఫలితం వచ్చేలా చూసే బాధ్యత ప్రభుత్వానిది అన్నారు. అందుకు సహకరించాల్సిందే ఉద్యోగులు అని అన్నారు. ఎవరి బాధ్యత వారు సక్రమంగా నిర్వహిస్తే ఎవరికీ ఇబ్బంది ఉండదన్నారు. సరిహద్దుల్లో సైనికులు సక్రమంగా బాధ్యతలు నిర్వహించడం పట్లే మనం సుఖంగా జీవిస్తున్నాం అన్నారు ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు పట్టణానికి వచ్చే ప్రతి పంట పల్లెల నుంచి వస్తున్న వాస్తవాన్ని గ్రహించాలన్నారు. అనంతరం కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ పరిధిలో తాము చెట్లను నాటుతున్న లేకుండా పోతున్నాయి అన్నారు వీటి గురించి అధికారులు శ్రద్ధ వహించాలన్నారు చెట్లను సంరక్షించాల్సిన బాధ్యత అధికారుల ది ప్రజలదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శేఖర్ యాదవ్, డ్వామా పీడీ, తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శ్రావణిశ్రీ దృష్టికి నీటిసమస్యను తీసుకెళ్లిన ప్రజాప్రతినిధులు

## – నీటి సమస్య రాకుండా ప్రజా ప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా కృషి చేయాలి

## –ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

నార్పల సూర్య వాస్తవం:
నార్పల మండలం లో నెలకొన్న నీటి సమస్యల పై



నార్పల మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచులు, ఎంపిటీసీలు తీసుకెళ్లారు. మండలంలోని చాలా గ్రామాల్లో తీవ్రమైన నీటి సమస్య ఉందని ముఖ్యంగా మేజర్ పంచాయతీ అయిన నార్పలలో నాలుగు బోర్లు వేసిన నీరు పడలేదని నీటి సమస్య తీవ్రంగా ఉందని మేజర్ పంచాయతీ సర్పంచ్ సుప్రియ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు అదే విధంగా సిద్ధిరాచర్ల పంచాయతీ సర్పంచ్ రామాంజనేయులు బండ్లపల్లి ఎంపీటీసీ శంకర్ యాదవ్ సిద్దరాచర్ల పంచాయతీలో తీవ్రమైన నీటి సమస్య ఉందని నీటిలో అధికశాతం ఫ్లోరైడ్ ఉండడంతో గ్రామంలో చాలామందికి కాళ్లు చేతులు వంకర పోతున్నాయని తెలిపారు. ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్ రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ నార్పల మండలంలో నీటి కొరత ఉన్న అన్ని పంచాయతీలలో ట్యాంకర్ల ద్వారానీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో నీటి కొరత ఉన్న మరికొన్ని ప్రాంతాల్లో నీటి వృథా అవుతోందన్నారు. గత మూడు సంవత్సరాలుగా వర్షాలు కురవక నీటి ఎద్దడి నెలకొందని నీరు వృధాకాకుండా గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానిక ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని కోరారు. నీటి కొరతతో మండల ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజా ప్రతినిధులు అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకోకుండా అందరూ కలిసికట్టుగా మండలంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో నిధులన్నీపై స్థాయిలోనే కరిగిపోయాయి అని స్థానికంగా ఉన్న సర్పంచులు ఎంపీటీసీలు కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలారని ఆయన ఫోటోపెట్టుకుని గెలిచిన స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలు ఏకరూపెడుతున్నారంటే గత ప్రభుత్వంలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అని తమ ప్రభుత్వంలో ఇకనుండి గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ అన్నారు. వివిధ శాఖల అధికారులు వారి వారి శాఖల ప్రగతి నివేదికలను తెలియజేశారు. ఇందిరమ్మ కాలనీ,అనంతపురం రోడ్డులోని ప్రభుత్వ భూములలో గతంలో ఇచ్చిన పట్టాలు మీద ఎటువంటి ఆధారాలు లేకుండా ఆక్రమించుకొని నిర్మాణాలు చెప్పటిన ప్లాట్లు మీద, అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందజేయాలని వామపక్ష నాయకులు సిపిఐ



మండల కార్యదర్శి గంగాధర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కు వినతిపత్రం సమర్పించారు.ఈ సర్వసభ్య సమావేశంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, జెడ్పీటీసీ నాగరత్నమ్మ,ఎంపీడీవో ఏసీ రాముడు, మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి, వెలుగు ఏపీ మద్దిలేటి ఈవో ఆర్ డి శైలజా రాణి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీ నర్సింహులు, వ్యవసాయ అధికారి చెన్న వీరా స్వామి, ఎంపీడీవో కార్యాలయం పరిపాలన అధికారిని ఉమాదేవి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రవీందర్ నాథ్ రెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ భారతి, ప్రభుత్వ వైద్యుల పవీణ్ కుమార్, మహేంద్ర,సిహెచ్ఓ బాలాజీ, వైద్యశాఖ సూపర్వైజర్లు అకులప్ప,శ్రీరాములు,ఎం పి హెచ్ఈఓ మల్లికార్జున, మేజర్ పంచాయితీ కార్యదర్శి అశ్వర్ధమ నాయుడు, ఏపీఓలు రమేష్ రామారావు ఎర్రమ్మ, ఎస్సీ సంక్షేమ వసతి గృహ అధికారి విజయ్ కుమార్,బీసీ వసతిగృహం అధికారిని ఏ.నారాయణమ్మ, సీనియర్ అసిస్టెంట్ నూర్ మొహమ్మద్ జూనియర్ అసిస్టెంట్ నరేంద్ర టైపిస్ట్ ఆనంద్ ఎంపీటీసీ సభ్యులు,సర్పంచులు వివిధ పంచాయతీల కార్యదర్శులు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిషేధంకోసం తీవ్రకృషి

మొదటిపేజీ తరువాయి..

గిరిజన శాఖ మంత్రి, అబ్కారీ మంత్రితో కలిసి ఈ ఉపసంఘం పనిచేస్తోందని వివరించారు. గంజాయి వివరాలు ఇస్తే వారికి బహుమతి ఇస్తామని ప్రకటించారు.

అన్ని జిల్లాలో కూడా ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని మంత్రి అనిత వెల్లడించారు. విశాఖపట్నం నుంచి అన్ని జిల్లా ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో మహీంద్రా వాహన తయారీ సంస్థ పోలీసులను బ్లాక్‌లో పెట్టిందని గుర్తుచేశారు. పోలీసులకు వీక్ ఆఫ్ మీద పరిశీలిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో సరెండర్ సెలవులు ఇవ్వకుండా చేశారని ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వంలో సరెండర్ లివులు నిధులిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం నాడు విశాఖ పోలీస్ కమిషనరేట్ హాల్లో మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో చివరికి పోలీసుల భద్రత కోసం పక్క రాష్ట్రం నుంచి తుపాకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. పోలీసు అకాడమీ లేని రాష్ట్రం ఏపీనే అని చెప్పారు. వైసీపీ హయాంలో అమరావతి కట్టడానికి నిధులిస్తే అమరావతిలో కట్టడం ఇష్టం లేక, కట్టడం మానేశారని అన్నారు. తమ ప్రభుత్వంలో సోషల్ మీడియా మీద దృష్టి పెడతామని మంత్రి అనిత పేర్కొన్నారు. మైనర్ బాలిక విషయంలో పోక్సో చట్టం అమలు అవుతోందని స్పష్టం చేశారు. విశాఖలో గంజాయి సేవించే వారికి అనుకూల ప్రాంతాలను గుర్తించి వాటి మీద పోలీసు దృష్టి పెట్టామని చెప్పారు. పోలీసు విభాగాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. డ్రగ్స్ తీసుకున్న వ్యక్తిని పరీక్షించి నిర్ధారించే పరికరాలు పోలీసు శాఖ వద్ద లేవని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో అధునాతన




పరికరాలు, వాహనాల నిర్వహణ సరిగా లేదని మండిపడ్డారు. పోలీస్ వ్యవస్థ మళ్లీ పటిష్టంగా పని చేయాలని మంత్రి అనిత సూచించారు. సోషల్ మీడియాలో కొంతమంది హోంశాఖపై, వ్యక్తిగతంగా తనపై బురద జలుతున్నారని విమర్శించారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. తమ ప్రభుత్వం వచ్చాక పోలీసు శాఖ పని తీరు మీద, వైసీపీ ప్రభుత్వ విఫల విధానాలపై త్వరలోనే పూర్తి సమాచారంతో మీడియా సమావేశం నిర్వహిస్తానని స్పష్టం చేశారు. పోలీసుల సంక్షేమంపై దృష్టి పెట్టామని అన్నారు. పోలీస్ అంటే భయం కాదు, భద్రత అని భరోసా రావాలన్నారు. తమ ప్రభుత్వ నేర నియంత్రణ చేస్తుందని తెలిపారు. మహిళా భద్రత మీద మరింత పటిష్టంగా పని చేయాలని సూచించారు. తిరిగి మళ్లీ గాడిలో పెట్టడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు.

# పెన్షన్ల పంపిణీకి ప్రభుత్వం సన్నద్ధం

మొదటిపేజీ తరువాయి..

జులై నెల ముగింపునకు వచ్చింది.. దాంతో ఆగస్టు 1వ తేదీన పెన్షన్ల పంపిణీకి రెడీ అవుతోంది.. పింఛన్ల లబ్ధిదారులకు ఒక్కరోజులోనే పంపిణీ పూర్తి చేయాలని గైడ్ లైన్స్ విడుదల చేసింది ఏపీ సర్కార్.. పెన్షన్ల పంపిణీపై మార్గదర్శకాలను విడుదల చేసింది గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ. ఆగస్టు 1వ తేదీన తెల్లవారు జామున 6 గంటలకే పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేయాల్సి ఉంటుందని.. రాష్ట్రంలోని అన్ని సచివాలయాల సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది ప్రభుత్వం.. పెన్షన్ పంపిణీ రోజే.. ఆగస్టు 1వ తేదీనే దాదాపు 99 శాతం పంపిణీని పూర్తి చేయాల్సి ఉంటుందంటూ ఆదేశాలు జారీ చేసింది.. అయితే, సాంకేతిక సమస్యలు తలెత్తితే మాత్రమే రెండో రోజు ఆ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేయాలని స్పష్టం చేసింది.. ఇక, గత నెలలో మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్‌తో కలిసి.. పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఈసారి.. అంటే ఆగస్టు 1వ తేదీన మడకశిర నియోజకవర్గంలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనబో తున్నారు సీఎం చంద్రబాబు నాయుడు.



# నేడు కుప్పంలో కలెక్టర్‌చే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ

కుప్పం (చిత్తూరు జిల్లా) సూర్య వాస్తవం:
చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చే నేడు కుప్పం ఎం పి డి ఓ కార్యాలయం లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ను ఉ.10 గం.ల నుండి మ.1 గం.వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక లో భాగంగా కుప్పం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కరించడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. కుప్పం నియోజక వర్గ, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ఈ కార్యకమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

# డిప్యూటీ సీఎం పవన్‌తో యూఎస్ కాన్సుల్ జనరల్ భేటీ

మొదటిపేజీ తరువాయి..

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పవన్‌కు అభినందనలు తెలియచేసి.. జ్ఞాపిక అందచేశారు యూఎస్ కాన్సల్ జనరల్.. ఇక ఈ సందర్భంగా జెన్నిఫర్ లార్సన్ టీమ్‌ను సత్కరించారు పవన్.. మర్యాదపూర్వకంగా జరిగిన ఈ సమావేశంలో.. ఆంధ్ర ప్రదేశ్ లో పెట్టుబడులకు, అభివృద్ధి ప్రాజెక్టులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.. రాష్ట్రంలో రాజకీయ స్థిరత్వంతో కూడిన ప్రభుత్వ పాలన ఉందని.. పెట్టుబడులను ప్రోత్సహించే సానుకూల దృక్పథం తమ ప్రభుత్వంలో ఉందని వెల్లడించారు పవన్ కల్యాణ్.. ఇక, మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే నైపుణ్యం కలిగిన యువత రాష్ట్రంలో ఉన్నారని వెల్లడించిన పవన్ కల్యాణ్.. వారి ప్రతిభకు తగిన అవకాశాలు అందించడంలోనూ, ఉన్నత విద్యకు అమెరికా వెళ్లేవారికీ తగిన సహకారం, మార్గనిర్దేశనం అందించాలని కోరారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఇక, పర్యావరణహితమైన కార్యక్రమాలకు ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూ.ఎస్. కాన్సల్ పొలిటికల్, ఎకనామిక్స్ విభాగం చీఫ్ ఫ్రాంక్ టాలుటో, ఆ విభాగం ప్రతినిధులు శ్రీమాలి కారే, సిబప్రసాద్ త్రిపాఠి పాల్గొన్నారు. కాగా, డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత వరుసగా తన శాఖలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్న పవన్ కల్యాణ్.. కీలక ఆదేశాలు జారీ చేస్తున్న విషయం విదితమే. గత ప్రభుత్వ హయాంలో ఆయా శాఖల్లో జరిగిన అవకతవకాలపై ఆరా తీస్తూ వస్తున్నారు పవన్ కల్యాణ్.



# డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కు ఊరట

మొదటిపేజీ తరువాయి..

క్రిమినల్ కేసులు పెట్టేందుకు ఇచ్చిన జీవోను ఉపసంహరించుకునే విషయాన్ని పరిశీలిస్తున్నామని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు చెప్పారు. ప్రభుత్వ న్యాయవాది వాదనను హైకోర్ట్ పరిగణలోకి తీసుకుంది. అప్పటివరకు గుంటూరు కోర్ట్‌లో జరిగే విచారణపై స్టే ఇవ్వాలని పవన్ న్యాయవాదులు కోరారు. దీంతో విచారణను నాలుగు వారాలకు హైకోర్ట్ వాయిదా వేసింది. అప్పటివరకు పవన్‌పై నమోదైన కేసులో తదనంతర చర్యలు నిలిపి వేయాలని హైకోర్ట్ ఆదేశించింది.

# ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్‌కు లైన్‌క్లియర్

మొదటిపేజీ తరువాయి..

ఏపీ ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది.. సుమారు రూ. 1 లక్ష కోట్లతో నాలుగు నెలల కోసం ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ జారీ చేసే అవకాశం ఉంది.. ఇవాళ లేదా రేపు ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్ ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేస్తుందనే చర్చ సాగుతోంది..కాగా, సార్వత్రిక ఎన్నికల కంటే ముందు జరిగిన బడ్జెట్ సమావేశాల్లో పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది అప్పటి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సర్కార్.. మళ్లీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడతామని ఈ సందర్భంగా వైఎస్ జగన్ ప్రకటించారు.. ఇక, సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయాన్ని మురగట్టుకుంది.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని భావించినా.. వివిధ శాఖలపై శ్వేతపత్రాలు విడుదల చేస్తూ వచ్చిన సర్కార్.. అసలు, బడ్జెట్ ప్రవేశపెట్టడానికి కూడా వీలుగా ఉన్న పరిస్థితులు లేవని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.. ఈ నేపథ్యంలో.. నాలుగు నెలలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టి.. ఆ తర్వాత మళ్లీ ప్రవేశపెట్టే అవకాశం ఉందంటున్నారు ఆర్థికనిపుణులు..

# వర్షాలతో ప్రాజెక్టులకు జలకళ

ఏలూరు,జూలై30(సూర్య వాస్తవం): ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిని ప్రజలు ఎంత బాగా ఆశీర్వదించారో రాష్ట్రాన్ని కూడా ప్రకృతి అదే విధంగా దీవిస్తోందని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ఏపీలో జలకళ సంతరించుకుందని ఆయన చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నదులు, జలాశయాలు నిండుకుండలా మారాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ..'భారీగా కురిసిన వర్షాల నేపథ్యంలో శ్రీశైలం డ్యాం ఐదు గేట్లు ఎత్తి 1.35లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నాం. నాగార్జునసాగర్ పూర్తి సామర్థ్యం 312క్యూసెక్కులకు గాను 140క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరింది. రాయలసీమ ప్రాంతానికి తాగు, సాగునీరు అవసరాలు తీర్చే విధంగా పోతిరెడ్డి, వెలుగోడు, అల్మట్టి డ్యాంలు నిండాయి.

## రాయన్‌లో ఆకట్టుకున్న ధనుష్: మహేష్ బాబు

ధనుష్ హీరోగా సందీప్ కిషన్, విజయ్ కాళిదాసు, దుషారా విజయన్, అపర్ణ బాలమురళి ప్రధాన పాత్రదారులుగా నటించిగా ఇటీవల థియేటర్లలో విడుదలై కలెక్షన్ల సునామీ సృష్టిస్తోన్న చిత్రం 'రాయన్' విడుదలైన మొదటి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళుతున్నది. ఈ చిత్రాన్ని కథానాయకుడు ధనుష్ స్వయంగా రచన చేసి దర్శకత్వం వహించిన ఈ చిత్రంపై ప్రేక్షకుల నుంచే కాకుండా తెలుగు, తమిళ సినీ సెలబ్రిటీల నుంచి కూడా ఊహించని విధంగా రెస్పాన్స్ వస్తోంది. సినిమాను పొగుడుతూ తమ తమ సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టులు పెడుతున్నారు.. తాజాగా టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు ఈ రాయన్ సినిమాను తిలకించి మూవీ గురించి తన అభిప్రాయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలిపారు. రాయన్ సినిమా అసాంతం ధనుష్ తన నటనతో ఆకట్టుకున్నాడని అంతేగాక బ్రిలియంట్‌గా డైరెక్ట్ చేశాడని ప్రకాశ్ రాజ్, సందీప్ కిషన్, ఎస్జే సూర్య ఇతర నటీనటులు అదర్భుతంగా నటించారని, మ్యాస్ట్రో రెహమాన్ సంగీతం ఎలక్ట్రిఫైయింగ్ ఉందని ఇది ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అంటూ చిత్రంపై పొగడ్తల వర్షం కురిపించారు. ÷ఖనికి ధనుష్ స్పందిస్తూ మీరు మా రాయన్ సినిమాను చూడడం ప్రశంసించడం హృదయాలను తట్టింది, మా టీమ్ అంతా థ్రిల్ ఫీలయ్యామని అన్నారు. ఎస్జే సూర్య మీ ట్వీట్ మాకు ఎంతో సపోర్టింగ్ ఉంది లప్లీ ట్వీట్ లవ్ యూ బాబు గారు అంటూ రీ ట్వీట్ చేయగా సందీప్ కిషన్ , అపర్ణ బాల మురళిలు కృతజ్ఞతలు తెలిపారు.





## తంగలాన్ చిత్రీకరణలో చర్మ సమస్యలు

పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా తెరకెక్కిన 'తంగలాన్' చిత్రంలో నటించడం వల్ల చర్మ వ్యాధుల బారిన పడినట్టు మలయాళ బ్యూటీ మాళవిక మోహనన్ తెలిపారు. బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.. దర్శకుడు పా.రంజిత్ కు చెందిన నీలం ప్రొడక్షన్‌తో కలిసి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో తెరకెక్కించారు. కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ బంగారు గనుల్లో పనిచేసే తమిళ కూలీల ఇతివృత్తంతో పీరియాడికల్ మూవీగా దర్శకుడు పా.రంజిత్ రూపొందించారు. ఈ సినిమా నిర్మాణంలో ఎదురైన అనుభవాలను మాళవిక మోహనన్ తాజాగా వివరించారు. 'ఈ మూవీలో వైవిధ్యభరితమైన పాత్రలో నటించాను. వేషధారణ కూడా అలాగే ఉంటుంది. ప్రతి రోజూ మేకప్ వేసుకునేందుకు కనీసం నాలుగు నుంచి ఐదు గంటల సమయం పట్టేది. ఎర్రటి ఎండల్లో ఈ సినిమా షూటింగ్ జరిగింది. సినిమా షూటింగ్ పూర్తయిన వెంటనే నేత్ర సమస్యలతో పాటు చర్మవ్యాధులతో ఇబ్బంది పడ్డాను. దీనికి కారణం.. మండిపోయే ఎండలు. పాత్ర కోసం వాడిన దుస్తులు. వేసిన మేకప్. దాదాపు ఐదారు మంది స్కిన్ స్పెషలిస్టుల (వైద్యులు)ను సంప్రదించాల్సి వచ్చింది' అంటూ మాళవిక మోహనన్ ఈ సినిమా చిత్రీకరణ సమయంలో తనకు ఎదురైన అనుభవాలను వివరించారు.

## తెలుగులో శ్రీలీల దూకుడు

తెలుగు నాట వరుస భారీ సినిమాలతో దూసుకుపోతోంది అచ్చ తెలుగు సోయగం శ్రీలీల ఈ యేడు గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ముద్దగుమ్మ ఈమధ్య సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి తన ఎడ్యుకేషన్ పూర్తి చేసే పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో సెలవు లభించినప్పుడల్లా విహార యాత్రలు చేస్తోంది. ప్రైవేట్ కార్యక్రమాలలో ఎక్కువగా పాల్గొంటోంది. ÷ూజాగా శ్రీలీల ఓ మ్యాగ్జిన్ కోసం బంగారు వర్ణం డ్రెస్‌లో దర్శనమిచ్చి అహుతులను షాక్‌కు గురి చేసింది. ఇంతకుముందు కన్నా కాస్త గ్లామర్‌ను జత చేసి హోయలు పోతూ తన అభిమానులకు సరికొత్త ట్రీట్ ఇచ్చింది. ఇప్పుడు ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



## గద్దర్ అవార్డులపై టాలీవుడ్ మౌనం

### సిఎం రేవంత్ రెడ్డి అసహనం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ టాలీవుడ్ పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గద్దర్ అవార్డులపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి స్పందన లేకపోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మక నంది అవార్డులను గద్దర్ అవార్డులతో భర్తీ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నిర్ణయాన్ని ప్రకటించింది. ఈ కొత్త కార్యక్రమాన్ని ఎలా సమర్థవంతంగా అమలు చేయాలనే దానిపై అభిప్రాయాన్ని, సూచనలను అందించాలని తెలుగు చిత్ర పరిశ్రమను సీఎం రేవంతరెడ్డి కోరారు. అయితే ఈ విషయంపై సినీ పరిశ్రమ మౌనంగా ఉందని ఆయన అన్నారు. ప్రముఖ తమిళ రచయిత, ఉ ద్యమకారుడు శివశంకరికి 'విశ్వంభర డాక్టర్ సి. నారాయణరెడ్డి జాతీయ సాహిత్య పురస్కారం' ప్రదానం సందర్భంగా రేవంత రెడ్డి కామెంట్స్ చేశారు. 'తెలుగు చిత్ర పరిశ్రమలో చేసిన కృషికి, విజయాలకు గౌరవంగా గద్దర్ అవార్డులను ప్రకటించాం. దీనిపై కార్యచరణ సిద్ధం చేయమని పరిశ్రమను కోరాం. సినీ పరిశ్రమ పెద్దల నుంచి ఎలాంటి స్పందన లేకపోవటం బాధాకరం' అని ముఖమంత్రి అన్నారు.





## అక్షయ్ కుమార్ ..ఖేల్‌ఖేల్‌మే

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ ఇటీవలే సర్ఫీరా సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ తెచ్చుకుంది. ప్రస్తుతం అక్షయ్ కుమార్ ఖేల్ ఖేల్ సినిమాలో నటిస్తున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 15న గ్రాండ్‌గా విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా నుంచి రెండో సాంగ్ ను విడుదల చేశారు మేకర్స్. అక్షయ్‌కుమార్, వాణీకపూర్ కాంబినేషన్‌లో వచ్చే ఈ పాట ఫీల్ గుడ్ ఇంప్రెషన్‌తో సాగుతూ మ్యూజిక్ లవర్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ పాట సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుందని విజువల్స్ చెబుతున్నాయి. ముదస్సార్ అజీజ్ డైరెక్ట్ చేసిన ఖేల్ ఖేల్ మే మూవీలో తాప్సీ పన్ను, వాణీ కపూర్, ప్రగ్యాజైశ్వాల్, ఫర్దీన్ ఖాన్, అమ్మీ విర్క్, ఆదిత్యా సీల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని టీ సిరీస్ వకూ ఫిలిమ్స్, కేకేఎం ఫిలిం ప్రొడక్షన్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



## గెలుపు క్రెడిట్ ని మిత్రుడికిచ్చిన సరబ్జోత్

జులై 30 .. పారిస్ ఒలింపిక్ లో భారత క్రీడాకారులు చరిత్ర సృష్టించిన రోజు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ కాంస్య పతక పోరులో సరబ్జోత్ సింగ్-మను భాకర్ సింగ్ కలిసి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ ఒలింపిక్స్‌లో భారత్ ఇప్పటి వరకు రెండు పతకాలు సాధించింది. విశేషమేమిటంటే షూటింగ్‌లో మాత్రమే భారత్‌కు రెండు పతకాలు దక్కాయి. నాల్గవ రోజు, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో ఈ రోజు (జూలై 30) కాంస్య పతక పోరులో సరబ్‌జోత్ సింగ్, మను భాకర్ కలిసి ఆడారు. ఇది సరబ్‌జోత్‌కు తొలి ఒలింపిక్ పతకం. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ క్రీడాకారిణిగా మను భాకర్ నిలిచింది. 22 ఏళ్ల సరబ్జోత్ 30 సెప్టెంబర్ 2001న అంబాలా (హర్యానా)లో జన్మించాడు. తొలిసారిగా ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న సరబ్‌జోత్.. కేవలం 13 ఏళ్ల వయసులో షూటింగ్ ప్రారంభించాడు. సమ్మర్ క్యాంప్ సమయంలో కొంత మంది పిల్లలు ఎయిర్ గన్‌లను తాత్కాలికంగా కాల్చడం సరబ్‌జిత్ చూశాడు. ఆ తర్వాత అతను ఈ క్రీడను కొనసాగించాలని నిర్ణయించుకున్నాడు. ఆ తర్వాత షూటింగ్‌లో అతని ప్రయాణం మొదలైంది. ఆ తర్వాత అంబాలాలోని ఏఆర్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో శిక్షణ ప్రారంభించాడు. సరబ్‌జిత్ తన తండ్రి జితేంద్రను తన అతిపెద్ద రోల్ మోడల్‌గా భావిస్తాడు. సరబ్‌జిత్ తన విజయానికి క్రెడిట్ తన స్నేహితుడు ఆదిత్య మల్రాకి ఇచ్చాడు. ఆదిత్య మొదటి రోజు నుంచి తనతో ఉన్నాడని, తన జీవితంలోని ప్రతి దశలో తనకు స్ఫూర్తినిచ్చాడని సరబ్జోత్ చెప్పాడు.



## స్వాతంత్ర్యానంతరం రెండు పతకాలు సాధించిన మను భాకర్

పారిస్ ఒలింపిక్స్‌లో భారత జోడీ మను భాకర్, సరబ్జోత్ సింగ్ చరిత్ర సృష్టించారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ షూటింగ్ ఈవెంట్‌లో మను, సరబ్జోత్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. కొరియా జోడీని భారత షూటర్లు ఓడించారు. అంతకుముందు ఆదివారం, మను భాకర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ లో కాంస్య పతకాన్ని గెలుచుకున్న విషయం తెలిసిందే. తాజాగా తన ఖాతాలో మరో పతకం యాడ్ అయ్యింది. ఒలింపిక్ పతకాన్ని గెలుచుకున్న మొదటి భారతీయ మహిళా షూటర్‌గా రికార్డ్ సృష్టించిన మను..ఒలింపిక్స్‌లో రెండు పతకాలను గెలుచుకున్న మొదటి క్రీడాకారణిగా మరో చరిత్ర సృష్టించింది. భారత స్టార్ జోడీ 16-10 తేడాతో దక్షిణ కొరియాకు చెందిన లీ ఒన్హో, ఓ ఏ జిన్‌పై విజయం సాధించింది. భారతదేశానికి ఇది చారిత్రాత్మక ఘట్టం. ఇంతకుముందు ఏ షూటర్ షూటింగ్‌లో రెండు పతకాలు సాధించలేదు. కానీ మను అద్భుతాలు చేసింది. ఈ విధంగా, స్వాతంత్ర్యం తర్వాత ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా మను భాకర్ నిలిచింది. బ్రిటీష్‌లో జన్మించిన భారత ఆటగాడు నార్మన్ ప్రిచర్డ్ 1900 ఒలింపిక్స్‌లో 200 మీటర్ల స్ప్రింట్, 200 మీటర్ల హర్డిల్స్‌లో రజత పతకాలు సాధించాడు. అయితే ఆ ఘనత స్వాతంత్ర్యానికి ముందే సాధించబడింది. పతకం సాధించిన అనంతరం సరబ్‌జోత్ సింగ్ మాట్లాడుతూ.. ఇది గర్వించదగ్గ క్షణమని పేర్కొన్నాడు. మేము సంతోషంగా ఉన్నాము. కానీ ఇది కఠినమైన పోరాటం. మరోవైపు మను కోరిక నెరవేరిందన్నాడు. అతని ఆనందం వెల్లివిరిసింది.




## చరిత్ర సృష్టించిన టేబుల్ టెన్నిస్ స్టార్

ప్యారిస్ ఒలింపిక్స్‌లో భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనిక బాత్రా చరిత్ర సృష్టించి దేశం గర్వించేలా చేసింది. 16వ రౌండ్‌కు అంటే ప్రీ-క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న తొలి భారతీయ క్రీడాకారిణిగా ఆమె నిలిచింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రితికా పవాడేపై 4-0తో విజయం సాధించిన ఆమె ఇప్పుడు పతకం సాధించే దిశగా ముందుకు సాగుతోంది. ఆమె తన ఆటతో మాత్రమే కాకుండా స్టైల్‌తో కూడా అభిమానులను మెస్మరైజ్ చేస్తోంది. మనిక నిజజీవితంలో చాలా స్టైలిష్‌గా ఉంటుంది. దానికి సంబంధించిన రుజువును ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కూడా చూడవచ్చు. వెస్ట్రన్ అయినా, ట్రెడిషనల్ అయినా ప్రతి లుక్ లో ఆమెను చూస్తుంటే అందాల రాణిలా కనిపిస్తుంది. ఆమె అందం ముందు బాలీవుడ్ అందాలు కూడా తేలిపోతాయంటే నమ్మాలి. మైదానంలో తన ఆటతో ప్రజల హృదయాలను గెలుచుకున్నప్పటికీ, ఆమె ఫ్యాషన్ సెన్స్ కూడా అద్భుతమైనది. ఒలింపిక్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న మొదటి టేబుల్ టెన్నిస్ ప్లేయర్‌గా నిలిచిన మనిక బాత్రా భారత క్రీడాభిమానుల హృదయాలను గెలుచుకుంది.



## రషీద్ ఖాన్ మరో భారీ రికార్డ్

ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ జట్టు వెటరన్ బౌలర్ రషీద్ ఖాన్ మరో భారీ రికార్డ్ ను సాధించాడు. తాజాగా ఈ లెగ్ స్పిన్నర్ %ు%-20 క్రికెట్‌లో తన 600 వికెట్లను పూర్తి




చేశాడు. 'ది హండ్రెడ్' పోటీలో అతను ఈ ఘనత సాధించాడు. మెన్స్ హండ్రెడ్ టోర్నీలో ట్రెంట్ రాకెట్స్ జట్టు తరపున ఆడిన రషీద్ మాంచెస్టర్ ఒరిజినల్స్ తో జరిగిన మ్యాచ్ లో ఈ ఘనతను నెలకొల్పారు. ఈ మ్యాచ్ లో రషీద్ 2 వికెట్లు పడగొట్టి టి20 ఫార్మాట్‌లో 600 వికెట్లు తీసిన ప్రపంచంలో రెండో ఆటగాడిగా నిలిచాడు. ఈ లిస్ట్ లో అగ్రస్థానంలో వెస్టిండీస్ మాజీ ఆల్ రౌండర్ డ్వేన్ బ్రావో 630 వికెట్లతో మొదటి స్థానంలో ఉన్నారు. వీరితో పాటు సునీల్ నరైన్ (557), ఇమ్రాన్ తాహిర్ (502) మాత్రమే టీ20 క్రికెట్‌లో 500 లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు పడగొట్టారు. బ్రావో తన టీ20 కెరీర్‌లో 545 మ్యాచ్‌ల్లో 600 వికెట్లు పూర్తి చేసుకోగా.. రషీద్ 441 మ్యాచ్‌ల్లోనే ఈ ఘనతను సాధించాడు. అక్టోబర్ 2015లో జింబాబ్వే క్రికెట్ జట్టుతో రషీద్ తన తొలి టీ20 మ్యాచ్ ఆడాడు. అతను ఇప్పటివరకు 441 టి20 మ్యాచ్‌లు ఆడాడు. అందులో అతను 18.25 సగటుతో, 6.47 ఎకానమీ రేటుతో 600 వికెట్లు తీసుకున్నాడు. టీ20 క్రికెట్ లో 4 మ్యాచ్ లలో 5 వికెట్లు తీశాడు. ఈ ఫార్మాట్‌లో అతని అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన 17 పరుగులిచ్చి 6 వికెట్లు తీసుకున్నాడు. రషీద్ తన టి20 అంతర్జాతీయ కెరీర్‌లో 93 మ్యాచ్‌లు ఆడాడు. 14.13 సగటుతో 152 వికెట్లు తీశాడు. ఇంతలో, అతని ఎకానమీ రేటు 6.08. ప్రస్తుతం అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ గా నిలిచాడు. ఈ జాబితాలో అతని కంటే ముందు న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సౌథీ మాత్రమే ఉన్నాడు. అతను 126 మ్యాచ్‌లలో 22.38 సగటుతో 164 వికెట్లు తీసుకున్నాడు. రషీద్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (%ఖూా%) కెరీర్ 2017లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (%లా=ు%)తో ప్రారంభమైంది. ఐపీఎల్‌లో 121 మ్యాచ్‌ల్లో 21.82 సగటుతో రషీద్ ఎకానమీ రేటు 6.82. తో 149 వికెట్లు సాధించాడు. ఈ కాలంలో అతని అత్యుత్తమ ప్రదర్శన 4/24. లీగ్ లో 150 వికెట్లు తీసిన 12వ బౌలర్‌గా నిలిచాడు. ఆఫ్ఘనిస్తాన్ నుండి ఐపీఎల్ లో కెప్టెన్ అయిన ఏకైక ఆటగాడు.

## ముగిసిన మాక్స్‌వెల్-ఆర్సీబీ బంధం!

ఐపీఎల్ మెగా వేలానికి అన్ని ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. నలుగురు నుంచి అయిదుగురు కంటే ఎక్కువ ఆటగాళ్లను రిటైన్ చేసుకోవడానికి అవకాశం లేదని సమాచారం అందడంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. పునాదులతో సహా నూతన జట్టును నిర్మించాలని కొన్ని ఫ్రాంచైజీలు ఆటగాళ్లతో పాటు కోచింగ్ స్టాఫ్‌కు గుడ్‌బై చెబుతున్నారు. ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్ తమ కోచ్ రికీ పాంటింగ్‌తో ఒప్పందానికి ముగింపు పలికింది. త్వరలో కొత్త కోచ్‌ను ప్రకటిస్తామని తెలిపింది. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా కోచింగ్ సిబ్బందిని మార్చాలని నిర్ణయించుకుంది. అయితే ఈ నేపథ్యంలో గెల్ మాక్స్‌వెల్ గురించి ఓ వార్త చక్కర్లు కొడుతోంది. మాక్సీ-ఆర్సీబీ బంధం ముగిసిందని జోరుగా ప్రచారం సాగుతోంది. సోషల్ మీడియాలో ఆర్సీబీని మాక్స్‌వెల్ అన్‌ఫాలో కొట్టడంతో ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూర్చింది. విధ్వంసకర బ్యాటర్ మాక్స్‌వెల్‌ను ఆర్సీబీ 2021 వేలంలో రూ.14.25 కోట్లకు దక్కించుకుంది. ఆ తర్వాత ఏడాది జరిగిన మెగా వేలానికి ముందు రూ.11 కోట్ల ఒప్పందంతో రిటైన్డ్ చేసుకుంది. 2021 సీజన్‌లో 513 పరుగులతో సత్తాచాటిన మాక్సీ ఆ తర్వాత 301, 400 పరుగులతో అంచనాలను అందుకోలేకపోయాడు. ఇక 2024 సీజన్‌లో అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. 10 మ్యాచ్‌ల్లో కేవలం 52 పరుగులే చేశాడు. ఈ నేపథ్యంలో మాక్స్‌వెల్‌పై వేటు వేశారని జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. మాక్సీ స్థానంలో యువ ఆల్‌రౌండర్ విల్ జాక్స్‌ను జట్టులో కొనసాగించాలని ఆర్సీబీ ఫ్రాంచైజీ భావిస్తుందని రాసుకొచ్చింది. కాగా, ఇటీవల జరిగిన మేజర్ క్రికెట్ లీగ్-2024లో మాక్సీ ఫామ్‌లోకి వచ్చాడు. వాషింగ్టన్ ఫ్రీడమ్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. అయితే మాక్సీ సోషల్ మీడియాలో అంతకుముందు ఆర్సీబీని ఫాలో అవుతాడా లేదా అనే విషయంపై స్పష్టత లేదు. కానీ ఇన్‌స్టాలో అన్‌ఫాలో చేశాడని ప్రచారం సాగుతోంది. మరోవైపు కేఎల్ రాహుల్ ఆర్సీబీలోకి వస్తాడని వార్తలు వస్తున్నాయి. ఈ విషయాలపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిందే.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG,ON BEHALF OF IRS PUBLICATIONS.13-2-819-2 RAMBOW RESIDENCE,RTC BUS STAND ROAD. SRINIVASA NAGAR ANANTAPUR,ANDHRA PRADESH-515001. GSTIN:37AAJF15233N1ZY.TEL:7672042522.VIJ ADDRESS:SHEETAL APARTMENT,TF2 DR NO:39-2-15/IE VIJAYAWADA-10.CHIEF EDITOR MD. SHAFEE AHAMED, MOB NO:9948461699.-EDITOR-M.IRSHAD BAIG.CELL: 918500425222 (FOUNDER- N.ARIF ALI).